


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 17-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 33 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## కాంగ్రెస్‌కు దూరంగా చిరు

- సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోలేదు
- సినీ రంగంలో బిజీ.. బిజీ..
- సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి

హైదరాబాద్: సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన చిరంజీవి అప్పటి నుంచి ఆ పార్టీ నేతగానే కొనసాగుతున్నారు. రాజ్యసభకు ఎన్నికై కేంద్ర మంత్రిగానూ పనిచేశారు. అనంతరం రాష్ట్ర విభజన తరువాయి 2లో..

# తపాను బాధితులూ అధైర్యపడొద్దు

### బాధితులను జగన్ ఆదుకోరా? .. సీఎం చంద్రబాబు నాయుడు



శ్రీకాకుళం: తఫాను బాధితులూ అధైర్యపడవద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. పలాస మండలం గరుడుభద్రలో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా తుఫాన్ బాధితుల సమస్యలను సీఎం అడిగి తెలుసుకున్నారు. భారీ ఎత్తున విపత్తు జరిగితే కేంద్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాన్ని ఆర్థిక సాయం అడిగితే ఐటీ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంటే ఆదుకునే బాధ్యత కేంద్రానికి లేదా? అని అడిగారు.

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాజకీయం కోసం విజయవాడ వచ్చారని చెప్పారు. ఇక ప్రతిపక్ష నేత జగన్ కోర్టుకెళ్లడానికి పాదయాత్ర వాయిదా వేస్తారు కానీ.. తుఫాను బాధితులను పరామర్శించడానికి వాయిదా వేయలేరా? అని నిలదీశారు. జగన్ పక్క జిల్లాలో ఉండి కూడా తుఫాన్ బాధితులను పరామర్శించడానికి రాలేదని విమర్శించారు. పరామర్శించకపోగా.. తాను దగ్గరుండి పనిచేస్తుంటే తరువాయి 2లో..




## పాల్ ఎలెన్ కన్నుమూత



సీటెల్ (అమెరికా): మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు పాల్ ఎలెన్ సోమవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా ఎన్‌హెచ్‌ఎల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం తరువాయి 2లో..









# ప్రతిభా అవార్డు గ్రహీత కొలిపే ప్రభాస్‌ను అభినందించిన ఎమ్మెల్యే



విశాఖపట్నం: గత సంవత్సరం జరిగిన పదవ తరగతి పరీక్షలలో పదికి పది పాయింట్లు సాధించిన అత్యుత్తమ ప్రతిభ కనభరిచిన జగ్గం పేట మాజీ - తాజా సర్పంచి కొలిపే ప్రసన్నరాణి తనయుడు కొలిపే ప్రభాస్ ముఖ్యమంత్రి చేతులమీదుగా సోమవారం ఒంగోలులో దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభా అవార్డును అందుకున్నారు. పదిపాయిం ట్లు సాధించడంతో జగ్గంపేట మండలం నుంచి ఎంపికైన కొలిపే ప్రభాస్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కార బహుమతి, 20 వేల రూపాయలు నగదు లేనోవా ట్యాబ్‌ను అందుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రభాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి మారిశెట్టి భద్రం, కుదవ వాసు, నీలం శ్రీను తదితరులు ఉన్నారు.

# ఇన్‌చార్జ్ ఎంపిడిఒగా చంద్రశేఖర్

రోలుగుంటః రోలుగుంట ఇన్‌చార్జ్ ఎంపిడిఒగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సూపరిండెంటెంట్‌గా పని చేస్తున్న వి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మేరకు ఎంపిడిఒ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎంపిడిఒ కె.శచిదేవీ పిహెచ్‌డి కోసం సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో చంద్రశేఖర్‌ను నవంబర్ 23వరకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ సమస్యలపై నేరుగా దరఖాస్తులను అందించాలన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# తుఫాన్ బాధిత ప్రాంతాల పర్యటన

విజయనగరం: తిత్లీ తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలను రాష్ట్ర గిరిజన , సాంఘీక సంక్షేమ శాఖామాత్యులు నక్కా ఆనందబాబు మంగళవారం పరిశీలించారు. జిల్లాలో గరుగుబిల్లి మండలం గిజబ గ్రామంలో అరటి తోటలను పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు రుణమాఫీ చేయాలని మంత్రిని కోరారు. ఈ పర్యటనలో ఐటిడిఎ పి.ఓ డా.జి.లక్ష్మిశ, పార్వతీపురం ఆర్‌డిఓ సుదర్శనదొర తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల రక్తదానం శిబిరం

నర్సీపట్నంః విధి నిర్వహణలో ఆశువులు బాసిన పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం పోలీసులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ రక్తదానం చేశారు. అనంతరం రూరల్ సిఐ రేవతమ్మ, ఎస్సైలు రక్తదానం చేశారు. టౌన్ సిఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో పోలీసుకలు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

**రైతులకు ఊరటనిచ్చిన వర్షం**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులకు ఆది, సోమవారాల్లో కురిసిన వర్షం ఊరటనిచ్చింది. రోజూ సాయంత్రం వేళా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో వరి నారుమడులకు ఊపిరిపోసినట్లైంది. వర్షాలు తమకు అనుకూలంగా ఉన్నాయని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



భీమునిపట్నం భీమిలి శివాలయ ప్రాంగణంలో గల చోడేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల సంధర్భంగా బుధవారం లక్ష్మీ స్వరూపంగా భ్రమరాంబికాదేవికి పూజ నిర్వహించిన అర్చకులు ఏడిద. సుబ్రహ్మణ్యశర్మ అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేసారు.

# ఒకటో వార్డులో శ్రీదేవీశరన్నవరాత్రులు

నర్సీపట్నంః నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు బిసి కాలనీలో శివాలయం వద్ద శ్రీదేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నూకాంబిక ఆలయ కమిటీ చైర్మన్ మాకిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అగ్నిగుండం, విష్ణుపూజలు నిర్వహించారు. అధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు మాకిరెడ్డి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవానీ మాలధరించిన భక్తులు, మహిళలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో మంగళవారం ఉదయం అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు గావించారు. దేవాలయం అర్చకులు చాణక్య, అనిల్, శ్రీ హర్షల ఆధ్వర్యంలో స్నపనము, అభిషేకము, అర్చన, సింధూర, తమలపాకుల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి ఎస్ ట్రస్ట్‌సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, ఆలయ పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు, ఎం వి రమణ, భక్తులు పాల్గొన్నారు.

## దేవీనవరాత్రుల్లో ఉగ్ర దాడులకు కుట్ర!

కోల్‌కతా: దేశంలో దుర్గా నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించే ప్రాంతాల్లో పశ్చిమ్‌బంగ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఘనంగా సంబరాలు చేసుకుంటారు. కాగా దుర్గాపూజలు నిర్వహించే మండపాలపై దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. బంగ్లాదేశ్‌కు చెందిన జమాత్ ఉల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థ దాడులకు పాల్పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కేంద్ర నిఘా సంస్థలు పశ్చిబ్‌బంగాకు సూచించాయి. ఉత్తర బెంగాల్ లో దాడులు జరిగే ప్రమాదం ఉందని తెలిపాయి.

**మొదటి పేజీ తరువాయి**

## కాంగ్రెస్‌కు దూరంగా చిరు

జరగడం, కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో ఆ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే సినిమాలతో బిజీగా మారారు. 150వ చిత్రం ఖైదీ నం.150తో ప్రేక్షకుల ముందుకొచ్చిన చిరంజీవి... ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుడు సైరా నరసింహారెడ్డి బయోపిక్ సైరాలో నటి స్తున్నారు. ఆ తర్వాత కూడా ఆయన మరిన్ని సినిమాల్లో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల చిరంజీవి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కాలపరిమితి ముగియగా.. దాన్ని పునరుద్ధరించుకోలేదు. దీంతో ఆయన ఆ పార్టీకి దూరమైనట్లేనని తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీలో క్రియాశీలకంగా ఉండాలని ఇటీవల రాహుల్‌గాంధీ.. చిరంజీవిని కోరినట్లు తెలుస్తోంది. దీనికి ఆయన నుంచి స్పందన లేనట్లు సమాచారం. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి ఇక దూరమైనట్లేనని భావిస్తున్నారు.

## తపాను బాధితులూ అధైర్యపడొద్దు

ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ధ్వజమెత్తారు. మంత్రులు, అధికారులు కూడా సామాన్యుల్లా కష్టపడుతున్నారని సీఎం గుర్తుచేశారు.

## పాల్ ఎలెన్ కన్నుమూత

పాల్ సీటెల్ (అమెరికా): మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు పాల్ ఎలెన్ సోమవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా ఎన్‌హెచ్‌ఎల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం పాల్ చనిపోయినట్లు ఆయన సోదరి ఓ ప్రకటన విడుదల చేశారు. పాల్ ఎలెన్ ఐటీ రంగంలో చెరగని ముద్ర వేసుకున్నారు. మైక్రోసాఫ్ట్ సహా టెక్ రంగానికి పాల్ అందించిన సేవలు ఎనలేనివి. సంస్థ సహ వ్యవస్థాపకుడిగా నిరంతర శ్రమతో ఎన్నో విజయాలు సాధించారు. మాకు మరెన్నో అనుభవాలు, అనుభూతులు మిగిల్చారు. నేను ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నా. ఆయనలోని ఉత్సాహం మైక్రోసాఫ్ట్ కుటుంబంలో నూతన ఉత్తేజాన్ని నింపింది. పాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా అని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఓ ప్రకటనలో తెలిపారు. బిల్‌గేట్స్, ఎలెన్‌పాల్ కలిసి మైక్రోసాఫ్ట్ సంస్థను 1975లో స్థాపించారు. మైక్రోసాఫ్ట్‌లో వాటా సహా.. 20.2 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలోని ధనవంతుల్లో పాల్ 46వ స్థానంలో ఉన్నారు. 1986లో ఉల్కన్ ఇంక్ అనే సంస్థను స్థాపించారు.

# చోద్యంలో గ్రామసభ

గొలుగొండః చోద్యం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు.

గ్రామ సభలో ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల చేపట్టిన పారిశుధ్య పనులను అధికారులు పరిశీలించారు.

ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేకాధికారి ప్రతాప్ మాట్లాడారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి అభివ అద్ధి పనులు చేపడతామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె. రమణమ్మ, మాజీ సర్పంచ్‌లు అదుపురెడ్డి ప్రభాకర్, కొప్పోజు లక్ష్మి , గ్రామ పెద్దలు దేవాడ శేషు, వెలుగు కార్యకర్త వెంకటలక్ష్మి ,అంగన్వాడీ కార్యకర్త సత్య , ఉపాధి హామీ వి ఆర్ పి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు

## ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

యలమంచిలి రూరల్ః అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పూడి గ్రామంలో గ్రామదర్శిని గ్రామ వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి గ్రామస్థుల అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు.

మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికి ప్రభుత్వ ఇళు ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, అర్హులైన వారందరికి అన్ని ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలోనే పల్లెలు అభివృద్ధి చెందాయన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాజాన రమేష్‌కుమార్, జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బసవరెడ్డి నర్సింగరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శరన్నవరాత్రులలో భాగంగా కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు భక్తులకు గంగాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. కలియుగంలో మనుషులు చేసిన సర్వ పాపములు తొలగిపోవుటకు గంగానదిలో స్నానం చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో మత్స్యకారులకు తిత్లీ తుపాను సందర్భంగా పండ్లు పంపిణీ చేస్తున్న ఏపీ స్టేట్ బార్ కౌన్సెలింగ్ మెంబర్, న్యాయవాది బైపా అరుణ్ కుమార్. చిత్రంలో కదిరి రాము తదితరులు ఉన్నారు.

# కేంద్రం నుంచి ఏం రాలేదు

## నిరుద్యోగ భృతి రూ.3 వేలు, టీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఇదీ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మంగళవారం నా టీఆర్‌ఎస్ పాక్షిక మేనిఫెస్టోను విడుదల చేశారు. మేనిఫెస్టో కమిటీకి 300కు పైగా విజ్ఞాపనలు వచ్చాయని చెప్పారు. టీఆర్‌ఎస్ మేనిఫెస్టో కమిటీ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బెజవాడ నుంచి పాదయాత్ర: కేసీఆర్ కోసం ప్రచారం చేస్తానని ఏపీ రోహిత్, కేటీఆర్ ఆలింగనం తెలంగాణను సాధించిన పార్టీ టీఆర్‌ఎస్ అన్నారు. కొన్ని పార్టీలకు పొలిటికల్ గేమ్ అయితే, మాకు మాత్రం టాస్క్ అన్నారు. గత నాలుగేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మేనిఫెస్టోను రూకపల్పన చేశామని చెప్పారు. ఓట్లు రాబట్టుకోవడానికి తాము మేనిఫెస్టోను తయారు చేయలేదని చెప్పారు. తెలంగాణను సాధించిన పార్టీగా తమపై బాధ్యత ఉందన్నారు.

మేనిఫెస్టో కమిటీకి వచ్చిన దాదాపు 300 విజ్ఞాపనలతో పాటు నాలుగేళ్లుగా ప్రజలు సూచించిన విజ్ఞాపనలు కూడా పరిగణలోకి తీసుకున్నామని కేసీఆర్ చెప్పారు. మేం చేరుకోవాల్సిన గమ్యాలు చాలా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఎంతో అయోమయ పరిస్థితి ఉండేదన్నారు. ఆనాడు ఓ పథకం రూపకల్పణ చేయడానికి ఎంతో తర్జన భర్జన పడ్డామని చెప్పారు. ఏడాది తర్వాత తర్వాత గానీ కళ్యాణలక్ష్మిపై ఓ అవగాహనకు రాలేకపోయామన్నారు. ఇప్పుడు రాష్ట్ర పరిస్థితిపై సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు. తమకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తి అవగాహన ఉందన్నారు.

# సరస్వతీ నమస్తుభ్యం..



సకల విద్యలకు అధిదేవత సరస్వతీ మాత. స్థానిక బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం విద్యాలక్ష్మిగా దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారిని విశేష అలంకరణలో దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఆ ఇద్దర్నీ వదిలేసి చంద్రబాబుపై ఆరోపణలేంటి?

విజయవాడ: రాష్ట్రానికి ఎవరైనా సీఎం కావొచ్చు. అయితే ఆ వ్యక్తి అందరివాడు కావాలి. మీ అన్నయ్య 'అందరివాడు' సినిమా తీశారు. కానీ ప్రజా జీవితంలో కొందరివాడిగానే మిగిలారు అంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రజారాజ్యం తరపున పవన్ ప్రచారం చేసినా పాలకొల్లులో చిరంజీవి ఓడిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అందరివాడు కాబట్టే చంద్రబాబు సుమారు 14 ఏళ్లుగా సీఎంగా కొనసాగుతున్నారన్నారు. దేశంలో అవినీతి రహిత రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో ఉందని, ఆ విషయం కూడా తెలియని పవన్.. రాష్ట్రంలో అవినీతి జరుగుతోందనడం ఆయన అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఆఫ్ ఇండియా సర్వే ఏపీలో అవినీతి అతి తక్కువని వెల్లడించిన విషయం పవన్‌కు తెలియకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. దేశమంతా రఫేల్ స్కామ్‌పై గగ్గోలు పెడుతుంటే పవన్ మాత్రం ఎందుకు ప్రశ్నించటం లేదని యనమల నిలదీశారు. అవినీతిపై పోరాటం చేయాలనుకుంటే వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన వైకాపా అధ్యక్షుడు జగన్‌పై చేయాలని సూచించారు. రఫేల్ సూత్రధారి మోదీ, అవినీతి పరుడు జగన్‌లను వదిలేసి చంద్రబాబుపై ఆరోపణలు చేయడమేమిటని మండిపడ్డారు. భాజపా, వైకాపాలతో పవన్ లాలూచీ పడ్డారనేదానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని దుయ్యబట్టారు. రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన జగన్‌ను పవన్ వెనకేసుకు వస్తున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరం కవాతు సందర్భంగా పవన్ చేసిన ప్రసంగంలో కొత్తదనం ఏమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, చంద్రబాబును విమర్శించడమే లక్ష్యంగా పవన్ ప్రసంగం కొనసాగిందని యనమల ధ్వజమెత్తారు.

# శబరిమలలో ఉద్రిక్త పరిస్థితులు

## మహిళలను అడ్డుకుంటున్న అయ్యప్ప భక్తులు

తిరువనంతపురం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో నేటి నుంచి ఆలయ ద్వారాలు తెరుచుకోనుండటంతో మహిళల రాక మొదలైంది. ఆలయం వైపు వెళ్తున్న మహిళలను అయ్యప్ప భక్తులు అడ్డుకుంటున్నారు. ఆలయంలోకి మహిళలను అడుగు పెట్టనీయబోమని.. అవసరమైతే దాడులకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. కేరళ ప్రభుత్వం మాత్రం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని.. ఆలయ సందర్శనకు వచ్చే భక్తులకు తగిన భద్రత కల్పిస్తామని అంటోంది.

శబరిమలలో అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం ఆలయం తెరవాల్సి ఉండగా.. అయ్యప్ప భక్తులు, ఆందోళనకారులు శబరిమలలోకి ప్రవేశించే బస్సులు, ఇతర వాహనాల్లో మహిళల కోసం గాలిస్తున్నారు. మహిళలను వాహనాల నుంచి కిందకు దించేస్తున్నారు. ఆలయానికి వెళ్లే మార్గంలో తొలి క్యాంప్ అయిన నీలక్కాల్ వద్దే మహిళలను అడ్డుకుంటున్నారు. ఇక్కడి నుంచి పంబా ప్రాంతానికి వెళ్తారు. గతంలో మహిళల్ని పంబా వరకు అనుమతించేవారు. అయితే ఇప్పుడు ఆందోళనకారులు నీలక్కాల్ వద్దే మహిళల్ని ఆపేస్తున్నారు.

తమను నీలక్కాల్ బేస్ క్యాంప్ వద్ద ఆపేసినట్లు కొందరు మహిళలు, జర్నలిస్టులు వెల్లడించారు. ఆందోళన చేపడుతున్న పలు సంఘాలు నీలక్కాల్, పంబా క్యాంపుల వద్ద పెద్దయెత్తున మోహరించాయి. సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని భాజపా ఆధ్వర్యంలో జరుగుతున్న భారీ ఆందోళనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొంటున్నారు. అయితే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాత్రం తాము సుప్రీం తీర్పునకు అడ్డుచెప్పబోమని వెల్లడించారు. ప్రజలు శాంతి భద్రతలను వారి చేతుల్లోకి తీసుకోవడాన్ని ప్రభుత్వం అంగీకరించదని తెలిపారు. తీర్పుపై పునఃసమీక్ష పిటిషన్ దాఖలు చేయబోమని, కోర్టు తీర్పును అమలు చేస్తామని చెప్పారు. భక్తులకు భద్రత కల్పిస్తామని తెలిపారు.

ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఆలయ నిర్వహణ చూసుకునే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, పండలం రాజ కుటుంబం, ఆలయ ప్రధాన పూజారి, అయ్యప్ప సేవా సంఘం తదితర భక్తి సంఘాలు నేడు సమావేశమయ్యాయి. ప్రస్తుతం నెలకొన్న వివాదాలపై వీరు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## తిత్లీ తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలి

### సిపిఐ (ఎం) డిమాండ్



విశాఖపట్నంః శ్రీకాకుళం జిల్లాను అతలాకుతలం చేసిన తిత్లీ తుపాను బాధితులను ఆదుకుని వారికి తక్షణమే పునరావాస చర్యలు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయకుండా ఆదుకోవాలని తక్షణ సహాయం అందించాలని పేర్కొన్నారు. తుపాను ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అక్టోబర్ 15వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం టెక్కలి, వజ్జరపుకొత్తూరు, సంతబొమ్మాలి, నందిగామ మండలాల్లో నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి బి.కృష్ణమూర్తి, ఆనందరావు తదితరులు పర్యటించారు. అనేక గ్రామాల్లో ప్రజలకు కనీసం మంచినీరు కూడా అందలేదని ఆందోళన చెందారు. అమలపాడు గ్రామంలోని రోడ్డుపై ఉన్న కుటుంబం దున్న సూర్య, ఫకీరు, ఉషా వీరి కుటుంబం వెయ్యి రూపాయలు పెట్టి డ్రమ్ము నీరు కొన్నామని చూపించారు. అమలపాడులోగాని, వజ్రపుకొత్తూరు మండలం ఉద్దం రామకృష్ణాపురం (యు.ఆర్.కె.పురం) తదితర గ్రామాల్లో ప్రభుత్వం తుఫాన్ వచ్చి 5వ రోజు అయినా కనీస రేషన్ కూడా అందించలేదు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటార్లు, సెల్ చార్జింగ్‌లు లేకపోయాయన్నారు. కొవ్వొత్తులకు గిరాకీ ఎక్కువైందని అన్నారు. ౖ నిత్యవసర వస్తువులను అనేక రెట్లుకు అమ్ముతున్నారని ప్రభుత్వం ధరలను ఎందుకు నియంత్రించకపోతుందని ప్రశ్నించారు. టెక్కలిలో మేము పరిశీలించిన సుమారు 300 ఇళ్ళు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాని ప్రభుత్వ లెక్కల ప్రకారం తిత్లీ తుఫాన్లో కూలిపోయిన ఇళ్ళు 49గా పేర్కొన్నారు. ఇది వాస్తవం కాదు. అధికారులు ప్రతి మట్టిమిద్దె ఇళ్ళను పరిశీలించాలని కోరుతున్నారు. ఉద్దాన ప్రాంతంలోని జీడిమామిడి, కొబ్బరి పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇతర ప్రాంతాల్లో కూడా వరి, అరటి, మామిడి, టేకు, బొప్పాయి, మునగ లాంటి పంటలు కూడా పూర్తిగా నాశనమయ్యాయి. వ్యవసాయదారులు, కౌలుదారులు, కూలీలు కోలుకోవడానికి ఒక తరం పడుతుందని ప్రజలు తమ బాదలను వ్యక్తపరిచారు.

ఒకవైపున కిడ్నీ జబ్బులతో అనారోగ్యంతో వున్న ప్రాంతంలో మంచినీటి సమస్య మరింత తీవ్రంగా మారింది. డయాల్‌సిస్ సెంటర్లు పనిచేయడంలేదు. పలాస వున్న సుమారుగా 100 పైగా జీడి ఫ్యాక్టరీలు మూతపడితే 20వేల మందికి పైగా కార్మికులు రోడ్డున పడతారు. రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కూడా ప్రకటించాలి. కేంద్ర ప్రభుత్వం తిత్లీ తుఫాన్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణ సహాయం రూ.1200 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

### సిఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం, రాస్తారోకో, రోడ్లపై వంటా వార్పు



విశాఖపట్నంః రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమ్మె 13రోజులు అవుతున్నా తెలుగుదేశం ప్రభుత్వం సమ్మె డిమాండ్ల పరిష్కరించకుండా మొండివైఖరితో ఉండటం దుర్మార్గమని సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్‌కెఎస్‌వి కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మద్దిలపాలెం సిపిఎం కార్యాలయం నుండి మద్దిలపాలెం జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో మొండెం లేని రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం మద్దిలపాలెం సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుమార్ పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపుగా ఉందన్నారు. విజయవాడలో జెఏసి నాయకులతో చర్చలకు కూర్చున్నా ఏమీ ఫలితం లేకుండా పోయిందని అన్నారు. ప్రభుత్వ మంత్రులు చర్చలకు రాకుండా అధికారులను పంపడం వలన ఏమాత్రం ప్రయోజనం ఉండదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు సమ్మెలో ఉండటం వలన చెత్తలు ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో ప్రజలకు రోగాలు వస్తున్నాయన్నారు. మరోవైపు కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే పోలీస్‌లను పెట్టి అరెస్టులు చేయించడం దుర్మార్గమన్నారు. ప్రైవేట్‌కార్మికులతో పనిచేయించి మున్సిపల్ కార్మికుల సమ్మె నీరిగార్చే పద్దతిలో ప్రభుత్వం వ్యవహరించడం సరైనది కాదన్నారు. కార్మికులకు పని భద్రత కల్పించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు వి.కృష్ణారావు, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జె.ఆర్.నాయుడు, గౌరవాధ్యక్షులు కె.కుమారి, వార్డు నాయకులు చెల్లయ్యమ్మ, లక్ష్మి, రమణ, విజయ, రాజు, అప్పారావు, బేబి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

***వార్డు ఆఫీసుల వద్ద వంటా వార్పు కార్యక్రమం :***



సమ్మె డిమాండ్లు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని 7, 8 వార్డులు అప్పుఘర్ వద్ద, 9, 10 వార్డులు హెచ్‌బికాలనీ వార్డు ఆఫీస్ వద్ద, 11, 14 వార్డులు ఎంఆర్‌ఓ ఆఫీస్ రోడ్డులో, 17, 18 వార్డులు 17వవార్డు ఆఫీస్ వద్ద మంగళవారం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. వార్డు కార్యాలయాల వద్ద వంటలు చేసుకొని రోడ్లపైనే భోజనాలు చేస్తూ నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, జోన్ అధ్యక్షుడు వి.కృష్ణారావు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.నూకరాజు, జోన్ కార్యదర్శి జె.ఆర్.నాయుడు, కె.కుమారి తదితరులు సందర్శించారు.

### ప్రతిభ అవార్డుల పంట

## ప్రతిభ విద్యాలయానికి దక్కింది



ప్రతిభ అవార్డుల గ్రహీతలను సన్మానించిన పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత గౌరవ ప్రదమైన ప్రతిభ అవార్డు' సబ్బవరం ప్రతిభ విద్యాలయం ఐదింటిని కైవసం చేసుకున్నారని ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ అన్నారు. ప్రతి ఏటా పదవతరగతి 10 పాయింట్లు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పురస్కారం 'ప్రతిభ అవార్డు' మండలానికి ఆరు అవార్డులను కేటాయించారు. అందులో ఐదింటిని ప్రతిభ విద్యార్థులు కైవసం చేసుకోవడం గమనార్హమని తెలిపారు. ఈనెల అక్టోబరు 15న ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో కొల్లి శివప్రసాద్ (తవ్వవానిపాలెం) ఉసిరకల తేజవర్ధన్ (సబ్బవరం) మనపర్తి లక్ష్మి, గండి సింధూ, వంతల పూర్ణిమ అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ విద్యార్థులను సన్మానించి హర్షం వ్యక్తం చేశరు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### మైనార్టీ కార్పొరేషన్ ఈడీ శాస్త్రీ



కంచరపాలెం : మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను మైనార్టీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈ .డీ శాస్త్రీ పేర్కొన్నారు. ఈమేరకు జీవీఎంసీ 39 వ వార్డు పరిధి ఆర్‌అండ్‌బి కూడలి వద్ద నున్న సీమాంధ్ర ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో స్కాలర్ షిప్ కొరకు దరఖాస్తు చేసుకున్న పలువురు ముస్లిం లకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లడుతూ 2018 సంవత్సరానికి సంబందించి ధుల్ హన్ పథకం , పోస్ట్ మెట్రిక్, ఫ్రీ మెట్రిక్, ఓవర్ షిప్ ఎడ్యుకేషన్ కు సంబందించి కాలర్ షిప్ కొరకు 15 వందల మంది దరఖాస్తు చేసుకోగా అందులో ప్రస్తుతం 11 వందల దరఖాస్తులు ఆమోదించబడ్డాయని అన్నారు.

కార్య క్రమంలో జిల్లా అదనపు ఖాజీ సయ్యద్ శంషు ద్దీన్, సోషల్ వెల్ఫేర్ సుపర్ నెంట్ గయాజుద్దీన్, అబ్దుల్ సమద్, షేక్ ఖాజా, అబ్దుల్ రషీద్, షేక్ షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో అమ్మవారికి పూజలు

భీమునిపట్నం : దేవీ నవరాత్రులు సందర్భంగా స్థానిక శివాలయంలో అమ్మవారికి ఆలయ పూజారి ఏడిద సుబ్ర హ్మణ్యం ఆద్వర్యం లో మంగళ వారం అమ్మవారిని మహాలక్ష్మి రూపం లో అలంకరించి ప్రత్యేక పూజలు ఉదయం నుంచి పూజలు చేశారు. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

### భవానీ మాల వేసిన భక్తులకు

## ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

భీమునిపట్నం : భవానీ మాలధారణ వేసిన భక్తులకు రూ. 1000 లతో విజయవాడ,అన్నవరం,ద్వారపూడి వెళ్ళి రావడానికి అవకాశం కల్పించనున్నట్లు వాల్తేర్ డిపో మేనేజర్ గంగాధర్ రావు తెలిపారు. 40 నుంచి 45 మంది భవానీ మాలధార్ణ వేసిన భక్తులు ఉంటే వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. భీమిలి, తగరపు వలస ప్రాంతంలో ఉండే భక్తులు వివరాలు కోసం 7036 265136 నంబర్ ను సంప్రదించాలనీ ఆయన తెలిపారు.

## ఘనంగా మరిడిమాంబ అమ్మవారి చాటింపు



భీమునిపట్నం : నాగవంశీయుల కులదైవం శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ ఈనెల 29,30,31 తేదీలలో జరుగునని పెద్దలు నిశ్చయించినట్లు గాడు అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా భీమిలికాళ్ళవీధి, అప్పికొండవీధి, కొంకివీధి, గాడు వీధి, నల్లివీధి, కృష్ణాకాలనీకు చెందిన నాగవంశీయుల పెద్దలు మరిడిమాంబ అమ్మవారిని సోమవారం రాత్రి చదునుపట్టుకు తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరుగుతున్న ఈ ఉత్సవాలలో తోలేళ్ళ ఉత్సవం, వివిధ రకాల నేలవేషములు, బండ్ల వేషములు, పులి వేషాలు,కోలాటాలు, బాణసంచా పెట్టి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నాగవంశీయుల భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగవంశీయులు కాళ్ళ నర్సింగరావు,అప్పికొండ సూరిబాబు, గాడు సన్యాసి నాయుడు, కంటుభుక్త ముత్యాలరావు,సంకురుభుక్త జోగారావు, బోని శ్రీను,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను, పనులను అడ్డుకోవద్దు

### - కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : చెత్తను రవాణా చేసే వాహనాలను, కార్మికుల పనులను అడ్డుకోవద్దని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నాలుగవజోన్ 39వ వార్డుకు చెందిన తెన్నేటినగర్, మాధవధారలలో పేరుకుపోయిన చెత్త, దుర్గంధభూయిష్టంగా ఉన్న ప్రదేశాలను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించి చెత్తను తొలగించారు. అక్టోబరు 4వ తేది నుండి 15 రోజులపాటు సమ్మె చేస్తున్న కార్మికులు వలన చెత్త పేరుకు పోయిందని, తాత్కాలిక కార్మికులతో చెత్తను ఎత్తించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కార్మిక నాయకులు, అవుట్ సోర్సింగ్ కార్మికులును కమిషనర్ ప్రజారోగ్యం, పారిశుధ్యం పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరించారు. అన్ని ఓపెన్ పోగులను దగ్గరుండి కమిషనర్ చెత్తను తరలించేలా పర్యవేక్షించారు. అన్ని వార్డులకంటే నాలుగవ జోన్ 39వ వార్డు సమస్యాత్మకంగా ఉన్నందున తానే స్వయంగా పర్యవేక్షించవలసి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్మికులకు వాస్తవ పరిస్థితి, పరిశుభ్రత, ఆరోగ్యపరిరక్షణ అంశాలపై వివరించారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ఫైనాన్స్) విజయమనోహర్, నాలుగవ జోనల్ కమిషనర్ రమణమూర్తి, ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, స్థానిక నాయకులు సనపల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**కమిషనర్‌కు అభినందించిన స్థానికులు** : తెన్నేటినగర్, మురళీనగర్‌కు చెందిన స్థానిక ప్రతినిధులు జివియంసి కమిషనర్ హరినారాయణన్‌ను పారిశుధ్యం, నగర అభివృద్ధిపట్ల చూపుతున్న చొరవను అభినందించారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



కంచరపాలెం : జీవీఎంసీ 41 వ వార్డు పరిది అశ్వనిపాలెం వద్ద నివాసముంటున్న బోసి పైడయ్య ( 45 ) ఆనారోగ్యానికి గురి కావడంతో వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహయ నిధి 40 వేల రూపాయల చెక్కును పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ (విప్ ) గణ బాబు మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈ మేరకు మామిడి లక్ష్మి, దుర్గా మహిళా సంఘం ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్క రించుకొని నిర్వహించిన అన్న సమారాధన కార్య క్రమంలో పాల్గున్న ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారిని దర్శించుకున్నారు అనంతరం అన్నసమరాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో టీడీపి వార్డు అద్య క్షుడు పెంటకోట త్రినాధరావు, అజయ్ బాబు, కార్తీక్ కుట్టా పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

### విభజనచట్టంలోని హామీలను

# తక్షణమే అమలు చేయాలి



గాజువాక: విభజన చట్టంలో పేర్కొన్న ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతం ప్యాకేజీని తక్షణమే అమలు పరచాలని కేంద్రాన్ని స్థానిక తెదేపా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యప్రతినిధుల విస్కృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇటీవల శ్రీకాకుళంలో తిత్లీ తుఫాన్ వలన అపార నష్టం జరిగిందని, అన్ని విధాలుగా నష్టపోయిన తుఫాన్‌బాధితులను కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసారు. తెలంగాణకు రూ.350కోట్ల రుపాయల వెనుకబడిన ప్యాకేజీ ఇచ్చిన కేంధ్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌కి ఇచ్చి వారంలోనే వెనక్కి తీసుకున్న తీరుపై ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్న జీవియల్ నరశింహన్‌లాంటి ద్రోహులు ఆత్మపరిశీలన చేసుకోవాలని డిమాండ్ చేసారు. తిత్లీ తుఫాన్ వలన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు దెబ్బతన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై స్పందిచకపోవడం ఆ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఉత్తరాంధ్ర సమస్యను మానవీయ కోణంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు గడిచిన వారం రోజులుగా పగలనక రాత్రనక కష్టపడుతుంటే కేంద్రం ప్రభుత్వం స్పందించకుండా నిరో చక్రవర్తులుగా వ్యవహరిస్తూ, రాష్ట్రాన్ని దెబ్బ కొట్టాలని ప్రత్నించడం దారుణమని మండిపడ్డారు. కష్టకాలంలో ఉన్న ఉత్తరాంధ్రకు ప్రత్యేకప్యాకేజీతో పాటు తుఫాన్ సహాయం కూడా అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు ప్రసా దుల శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు గంటాబ్బాయి, బొండాజగన్, మాడిశకనకరాజు, సాలపు అప్పారావు, తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షులు పప్పుఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యం



అచ్యుతాపురం: పాడిరైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యమని అచ్యుతాపురం శాఖ హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మండలంలోని రామన్న పాలెం గ్రామంలో హెరిటేజ్ పాడి రైతులు 65మందికి మంగళ వారం ఆయన చేతుల మీదుగా దాణా గిన్నెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ ట్రస్టులో సభ్యత్వం ఉన్నవారికి పశువులు తినే దాణాలో సబ్సిడీ, పశువులకు ఇన్స్యూరెన్స్, పాడి రైతుల పిల్లలకు 10వ తరగతిలో 90% పైబడి మార్కులు సాధించిన వారికి స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. రైతులకు బీమా పథకం లభిస్తుందన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## సౌదీ అదృశ్యాలు

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ అసమ్మతివాది, పాత్రికేయుడు జమాల్ ఖషోగ్గి టర్కీలోని సౌదీ రాయబార కార్యాలయానికి వెళ్లి అదృశ్యం కావడం దిగ్భ్రాంతికరం. సౌదీ ప్రభు త్వం ఖషోగ్గిని హతమార్చిందనే అనుమానాలు బలంగా ఉన్నాయి. సౌదీలో ఉన్నదే రాచరిక పాలన. అక్కడ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు తావులేదు. కానీ ఇటీవలికాలంలో సౌదీ రాచరిక వ్యవ స్థ మరింత క్రూరంగా మారింది. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ బలోపేతమై తాను మొత్తం అధికారాలు చేజిక్కించుకున్న తర్వాత అసమ్మతివాదుల అపహరణలు, హత్యలు, అదృశ్యాలు పెరిగిపోయాయి. జమాల్ ఖషోగ్గి ఈ నెల రెండవ తేదీన టర్కీలోని సౌదీ అరేబియా రాయబార కార్యాలయంలోకి వెళ్లినప్పుడు చివరిసారి కనిపించారు. తన కాబోయే భార్యను బయట ఉండమని, ఒంటరిగా వెళ్లారు. ఆయనకు సౌదీ రాచరిక వ్యవస్థపై అనుమానాలు ఉన్నందున, తాను బయటకు రాకపోతే, టర్కీ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయాలని కూడా హెచ్చరించారు. భయపడినట్టే సౌదీ రాయబార కార్యాలయం లోపలికి వెళ్లిన జమాల్ ఖషోగ్గి మళ్ళా బయటకురాలేదు. గతంలో వివాహమాడిన మహిళనుంచి విడాకుల ధ్రువపత్రం పొందడానికి ఖషోగ్గి ప్రయత్నిస్తున్నారు. ఈ పత్రం అప్పగిస్తామని చెప్పి సౌదీ రాయబార కార్యాలయ అధికారులు ఖషోగ్గిని రప్పించుకున్నారు. బయటకు పొక్కిన సమాచారం ప్రకారం ఖషోగ్గిని బంధించి విచారించడానికి సౌదీ నుంచి పదిహేను మంది టర్కీ రాయబార కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనను హింసించి హత్య చేశారనీ, శరీరాన్ని ముక్కలుచేసి బయటకు తరలించారని ఆరోపణలున్నాయి.

సౌదీ అరేబియా రాయబార కార్యాలయంలోకి వెళ్లినట్టుగా బయ ట కెమెరాల్లో ఉన్నది. కానీ బయటకు వచ్చిన ట్టు దాఖలాల్లేవు. ఖషోగ్గికి సౌదీ రాచ కుటుంబాలతో విస్తృతమైన సంబంధాలున్నాయి. సుదీర్ఘకాలం సంపాదక స్థాయిలో పనిచేసినందు వల్ల పాత్రికేయులతో నే కాకుండా, సమాజంలోని భిన్నవర్గాలతో పరిచ యం ఉన్నది. విదేశాల్లో కూడా పాత్రికేయుడిగా పనిచేశారు. ఆయనకు సౌదీ అరేబియాలోనే కాకుండా, అరబ్బు ప్రపంచమంతటా అభ్యుదయ వాదులలో గుర్తింపు ఉన్నది. ట్విటర్‌లో ఆయనను ఇరువై లక్షల మంది ఫాలో అవుతుంటారు. అమెరికాలోని ప్రముఖ దినపత్రికకు వ్యాసాలు రాస్తుం టారు. సౌదీ అరేబియా యువరాజు తమ దేశంలో ని అసమ్మతివాదులను అణిచివేస్తున్న తీరును ఆయన ఎండగట్టారు. సౌదీ అరేబియా పొరుగున ఉన్న ఖతార్‌తో కయ్యానికి దిగడాన్ని, యెమెన్‌లో దాడులు చేయడాన్ని, లెబనాన్‌తో గొడవలను, మహిళా హక్కుల ఉద్యమకారిణిని నిర్బంధించడా న్ని ఆయన విమర్శిస్తూ వ్యాసాలు రాశారు. పత్రికా ప్రముఖుడైన ఖషోగ్గి వ్యాసాలను భరించలేని సౌదీ ప్రభుత్వం ఆయనను హతమార్చి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఆయనను హింసించి హతమార్చినట్టు కొన్ని ఆధారాలు బయటపడ్డాయి. ఈ ఆధారాలు ఖషోగ్గి ధరించి యాపిల్ వాచ్ ద్వారా ఆయన కాబోయే భార్య దగ్గర ఉన్న ఫోన్‌కు చేరుకున్నాయని అంటున్నారు. లేదా టర్కీ ప్రభు త్వం సౌదీ అరేబియా కార్యాలయంలో రహస్యంగా అమర్చిన రహస్య కెమెరాల ద్వారా బయటకువచ్చి ఉంటాయి.

కానీ సౌదీ అరేబియా రాయబార కార్యాలయంలో తాము గూఢచర్యం చేసినట్టు టర్కీ బహిరంగంగా అంగీకరించదు. ఏది నిజమైనా ఖషోగ్గి అదృశ్యంపై నిష్పాక్షిక విచారణ జరిగేవిధంగా అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తేవాలె. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు ఖషోగ్గి అదృశ్యాన్ని ఖండించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఖషోగ్గి అదృశ్యం వెనుక సౌదీ అరేబియా హస్తం ఉంటే, కఠినంగా వ్యవహరిస్తామని మాట మాత్రంగా అన్నారు. ఆ వెం టనే సౌదీకి ఆయుధ సరఫరా మాత్రం ఆపబోమని స్పష్టం చేశారు. సౌదీ యువరాజు సల్మాన్ అణిచివేత విధానాలకు ట్రంప్ వత్తాసు ఉన్నదనేది జగమెరిగిన సత్యం. అందువల్ల అమెరికా ఒత్తిడి ఎంతమేర ఉంటుందనేది అనుమానమే సౌదీ అరేబియా ప్రభుత్వం విదేశాల్లో ఉన్న అసమ్మతివాదులను కూడా వదలకుండా వారిని అపహరించడం, హతమార్చడం ప్రమాదకర ధోరిణి. ఈ సంప్రదాయం ఇతర దేశాలు కూడా అనుసరిస్తే, భూగోళంపై స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఉండవు. సౌదీ అరేబియా రాజ కుటుంబాలకు చెందిన ప్రిన్స్ సుల్తాన్ బిన్ తుర్కికి అసమ్మతివాదిగా పేరున్నది. సౌదీ ప్రభుత్వానికి భయపడి ఆయన జెనీవాలో తలదాచుకుంటున్నాడు. 2003లో ఆయనను సౌదీ ప్రభుత్వం జెనీవాలో అపహరించి, తమ దేశానికి తరలించింది. లెబనాన్ ప్రధానిని తమ దేశానికి అతిథిగా ఆహ్వానించి, నిర్బంధించి, రాజీనామా ప్రకటన చేయించింది. కానీ అంతర్జాతీయ ఒత్తిడి రావడంతో విడుదల చేసింది.

## సెల్ కాదు ఇది హెల్: వర్క్‌షాపులో వక్తల అభిప్రాయం



విజయనగరం: పిల్లలు సెల్ ఫోన్ వినియోగించడం వల్ల అనేక నష్టాలున్నాయని జిల్లా విద్యావాఖాధికారి జి.నాగమణి అన్నారు. మంగళవారం కె.ఎల్.పురంలో జె.ఎస్ఎం కమ్యూనిటీ హాల్‌లో ఎపి. మహిళా సమతా సొసైటి. స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలబాలికలుసుల్‌ఫోన్ వినియోగం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గుతుందని, శారీకంగా, మానసింగా నష్టపోతారని కంటి దృష్టి, మేధస్సు తగ్గుతుందని, సమయం వృధా అవుతుందని, ఆరోగ్యంపై ప్రభావం చూపెట్టి నీరసంగా ఉంటారని అన్నారు. చదువులతో పాటు , క్రీడలపై ఆసక్తి చూపెట్టాలని ఆమె సూచించారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజక్టు అధికారి డా.శ్రీనివాసరావు సెల్‌ఫోన్ వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పి.ఓ వసంతబాల , వయోజక విద్యాశాక అధికారి ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ రేపటితరం వారికి సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే నష్టాలను అంతా తెలియజేయాలన్నారు. సమావేశానికి అధ్యక్షత బహించిన ఎపిఎంఎస్ఎస్ ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ కె.వాణి మాట్లాడుతూ పిల్లలు అవసరమైనంతవరకే ఫోన్లు వాడాలని, టివీల ప్రభావం కూడా పిల్లలపై పడుతుందని తెలిపారు. అనంతరం పిల్లఉ తైక్వాండో డెమో, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని దత్తిరాజేరు , మెంటాడ . గజపతినగరం, నెల్లిమర్ల , గుర్ల మండలాలకు చెందిన 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారికి కుంకుమపూజలు



గాజువాక: జీవీయంసీ 49వ వార్డు మల్కాపురం యాదవ వీధిలో విజ్ఞాన్ మండలి యాదవ సంఘం వద్ద యధువంశీ యూత్ కల్చరల్ అసోసియోషన్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రుల మహెూత్సవం సంధర్భంగా శ్రీశ్రీశ్రీ దుర్గాదేవికి ప్రత్యేకపూజలు, కుంకుమపూజలను మంగళ వారం వైభవంగా నిర్వహించారు.

ఈ కార్య క్రమానికి జీవీయంసీ 49వ వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జిసోమేష్, సీనియర్ నాయ కులు కాకిపోలిరెడ్డి లు పాల్గొని మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దైవచింతన కల్గివుండాలని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిం చాలని, ఔన్నత్యాన్ని భావితరాలకు తెలిపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవాని భక్తులు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కె.జి.బి పాఠశాలలో శిక్షణా తరగతులు



భీమునిపట్నం : స్థానిక కె.జి.బి. పాఠశాలలో ముప్పయి నాలుగు కే.జి.బి.పాటశాలలో పదవతరగతి చదువుచున్న విద్యార్థినీలకు ఎన్.టి.ఎస్.టి. కాలర్ షిప్ టెస్ట్ కు మూడు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణాతరగతులకు సుమారు 114 మంది విద్యార్థినిలు పాలుగొన్నారు. ఆఖరి రోజు మంగళవారం ఈ శిక్షణా శిభిరాన్ని స్టేట్ అబ్జర్ వర్ వై.నరసింహారావు, జి.సి.డి.ఓ.సి. హెచ్.రాజేశ్వరి లు సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడారు. కాలర్ షిప్ టెస్ట్ టాప్ త్రీ లో వున్న వారికీ ఫస్ట్ ఇయర్ 1250 ,సెకండ్ ఇయర్ నుంచి రెండు వేల రూపాయులు చొప్పున పి.జి వరకూ కాలర్ షిప్ ఇస్తారని వారు తెలిపారు. కెజిబి పాఠశాల ప్రత్యేక అధికారిని గ్రేస్ లిల్లీ పాటశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాగి పంట నాశనం చేసిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలి

కొయ్యూరు : డౌనూరు పంచాయతీ ముల్లుమెట్ట ఫారెస్ట్ భూమి సమస్యపై ఫారెస్ట్ అధికారులు గ్రామస్థుల రాగి పంటను నాశనం చేసినందుకు నిరసనగా సిపిఎం గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కొయ్యూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు మాట్లాడుతూ ముల్లుమెట్ట గ్రామంలో ఫారెస్ట్‌భూములను ఆ గ్రామస్థులు అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు చేసుకుంటున్నారన్నారు. 2011లో ఒకసారి, 2016లో పట్టాలు మంజూరు చేయాలని, అటువంటిది నేటికి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. అనేక సార్లు అధికారులు చుట్టూ, కార్యాలయాల చుట్టు తిరిగినా ఫలితం లేదన్నారు. పట్టాలు మంజూరుకాకపోవుట వలన ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా విత్తనాలు చల్లేటప్పుడు బెదిరించి కేసులు పెడుతున్నారన్నారు. అయినప్పటికీ రాగులు విత్తడం జరిగిందన్నారు. పంట దశకు వచ్చిన చోడి పంటను ఈ నెల 11వ తేదీన ఫారెస్ట్ అధికారులు పంటను నాశనం చేశారన్నారు. కేసులు పెట్టి భయబ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, గిరిజన సంఘం అధ్యక్షులు కె.శంకరరావు, పి.బొంజన్న, పి.బాలరాజు గ్రామస్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దృశ్యం

## సమయం

### కర్మ ప్రారబ్ధం

ఆరతార మూర్తులకు సైతం
కర్మ ప్రారబ్ధం తప్పదు
సంచిత, పురాకృత కర్మల
ఫలితం తప్పించుకొనుట అసాధ్యం
సుఖదుఃఖముల యందు సమదృష్టి
సర్వజీవ, సర్వమానవ సమానత్వ భావన
శృతి మించిన రాగద్వేషాదులు త్యజించుట
మన జీవన ప్రథమ కర్తవ్యం
సాదభావన, కర్మఫలములు త్యజించుట
తామరాకు పై నీటిబొట్టు జీవనం
ఈశ్వరార్పణ బుద్ధితో కర్మాచరణ
జనుల సేవతో జీవితాన్ని గడపడమే
జనార్ధనుని సేవ అన్నది ఆర్యక్తి

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి : అష్టమి మ.12.00; ఉత్తరాషాడ రా.9.39; రా.వ.2.04ల 3.50.

బుధవారం 17-10-2018

**a మేషం :** విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

**b వృషభం :** వైద్యులకు శస్త్రచికిత్స చేయునపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం.

**c మిథునం :** ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

**d కర్కాటకం :** రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

**e సింహం :** సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

**f కన్య :** రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్ధతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

**g తుల :** రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

**h వృశ్చికం :** నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్య క్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగు తాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

**i ధనుస్సు :** స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.

**j మకరం :** మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

**k కుంభం :** మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగు తున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూల మవుతాయి.

**L మీనం :** ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభా వం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.



## సకల సంపదలకు నిలయం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు

సంకీరణ

శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి కరుణ తమపై ప్రసరించాలని కోట్లాది భక్తులు నిత్యపూజలు చేస్తుంటారు. వైకుంఠంలో వున్న అమ్మవారు భక్తుల కోసం భూమిపై వెలసిన క్షేత్రమే మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని శ్రీమహాలక్ష్మీ ఆలయం. నిత్యం వేలాదిమంది భక్తులు ఆమెను దర్శించుకొని పునీతులవుతుంటారు. శక్తిపీఠంగా కూడా కొల్హాపూర్‌కు ఆధ్యాత్మిక ప్రాశస్త్యముంది.వైకుంఠపురి నుంచి.. శ్రీమహావిష్ణువు వైకుంఠంలో వుండగా భృగుమహర్షి వచ్చాడు. అయితే రుషి రాకను విష్ణువు గమనించలేదు. దీంతో ఆగ్రహం చెందిన భ ృగువు స్వామివారి ఎదపై కాలుపెట్టారు. దీంతో ఆగ్రహించిన లక్ష్మీదేవి భూలోకానికి వెళ్లి కొల్హాపూర్ సమీపంలో తపస్సులో మునిగిపోయింది. భ ృగువు పాదంలో కన్నును లౌక్యంగా తీసివేసిన మహావిష్ణువు రుషి గర్వాన్ని అణచివేశాడు. అనంతరం అమ్మవారి కోసం అన్వేషిస్తూ తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుడిగా అవతరించినట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. కొల్హాపురంలో వెలసిన అమ్మవారి ప్రాశస్త్యం అందరికి తెలియడంతో క్షేత్రం అందరికి దర్శనకేంద్రంగా మారింది.

ప్రళయంలోనూ చెక్కుచెదరదు.. ఈ ప్రాంతాన్ని కర్వీర్‌గా వ్యవహస్తారు. ఆ మహాదంపతులకు ఇష్టమైన ప్రదేశం కావడంతో మహాప్రళయంలోనూ చెక్కుచెదరదు. అందుకనే ఈ క్షేత్రాన్ని అవిముక్తేశ్వర క్షేత్రమని పేర్కొంటారు. లోకమాత జగదాంబ ఈ క్షేత్రాన్ని స ృష్టించింది. అందుకనే ఎన్నో వేల సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో మహర్షులు, రుషులు పూజలు చేసినట్టు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. అమ్మవారి తపస్సు అనంతరం ఒక్క రాత్రిలోనే ఈ ఆలయాన్ని నిర్మించినట్టు తెలుస్తోంది.

అరుదైన శిలపై అమ్మవారి రూపం

శ్రీమహాలక్ష్మీదేవి విగ్రహాన్ని అరుదైన శిలపై చెక్కారు. నాలుగు హస్తాలు కలిగి భక్తులను దీవిస్తున్న రూపం మనల్ని ఆకట్టుకుంటుంది. ఫలం, గద, కవచం, పాత్రను నాలుగుచేతుల్లో కలిగి వున్న దివ్యమంగళరూపం భక్తులకు ఎల్లప్పుడూ ఆశీర్వచనాలు ఇస్తుంటుంది. అంబా బాయిగా ఆమెను భక్తులు ఆరాధనతో పిలుస్తారు. ఆలయంలో ప్రతిరోజు జరిగే కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. శక్తిపీఠాల్లో కూడా కొల్హాపూర్ ఒకటి కావడం విశేషం.

కిరణోత్సవం.. సూర్యదేవుడు అమ్మవారి కటాక్షం కోసం ఏటా మూడురోజులు గర్భాలయంలోకి సూర్యకిరణాలను ప్రసారిస్తాడు. తొలిరోజు పాదాలకు, రెండో రోజు నడుము భాగానికి మూడోరోజు శిరస్సు భాగానికి కిరణాలు ప్రసారిస్తాయి. ఈ ఉత్సవాలను కిరణ్ ఉత్సవ్‌గా వ్యవహరిస్తారు. ఈ దినాల్లో అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు వేలాదిమంది భక్తులు కొల్హాపూర్‌కు చేరుకుంటారు. క్షీరసాగర మథనంలో జన్మించిన శ్రీలక్ష్మీదేవిని సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు తన హ ృదయేశ్వరిగా స్వీకరిస్తారు. నారాయణిగా ప్రసిద్ధికెక్కిన లక్ష్మీదేవి ఎక్కడ వుంటే అక్కడ సిరిసంపదలకు లోటువుండదు. ఆమె కటాక్షం కోసం యావత్ మానవాళి ప్రార్థిస్తుంది. స్వయంగా ఆమె తపస్సు చేసి వెలసిన ప్రాంతమే కొల్హాపురం. అందుకనే ఆ నగరంలో పేదరికం వుండదని సామెత. సహకార ఉద్యమంలో కొల్హాపూర్ కీలకమైన భూమిక పోషిం చింది. చక్కెర మిల్లులు ఎక్కువగా వుండటంతో భారతదేశానికి చక్కెర కేంద్రంగా మారింది.



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2564004

## జ్యూట్ మిల్ ఐక్యకార్యాచరణ కమిటీ సమావేశం



భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్ మిల్ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జ్యూట్ మిల్ కళ్యాణ మండపం లో సమావేశం జరిగింది. సభ అధ్యక్షులు కాకర్ల పూడి వరహలరాజు మాట్లాడుతూ ఐక్యం గా కలసి వుంటే కార్మికులకు న్యాయం చేయగలమని అన్నారు. అయిదు కార్మిక సంఘాలుతో చర్చలు జరిపారు. చర్చల అనంతరం మూడు పాయింట్లు తో మంత్రి గంటా శ్రీనివాసరావు ని కల వాలని నిర్ణయించారు.మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు సర్క్యూట్ హౌస్ లో మంత్రి గంటా శ్రీనివాసరావు ని కార్మిక సంఘాలు కలసి చర్చలకు వెళతామని అన్నారు.

ఆర్యవైశ్య వివాహ
పరిచయ వేదిక
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్య కులస్తుల వివాహ పరిచయ వేదికలో పాలు పంచుకునే వారు సంప్రదించండి
అక్టోబరు 28, ఆదివారం

రిజిస్ట్రేషన్లకు చివరి తేది : 25-10-18
ఉమియా భవన్ కళ్యాణ మండపం
సుబ్రహ్మణ్య స్వామి గుడి ఎదురుగా
ఎన్.ఎ.డి జంక్షన్, విశాఖపట్నం
98491 03826
80741 93882

DMK ITI (p)
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

APOSS (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter ( Any group ) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

# చంద్రన్నభీమా పరిహారం పంపిణీ



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 18వవార్డులో మృతి చెందిన పాలుపల్లి రమణ (51) కు చంద్రన్నభీమా పరిహారం ముప్పయి వేలు వర్తించగా ఆయన భార్య పాలుపిల్లి నాగమణి కు భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు,తక్షణ సహాయం క్రింద ఐదు వేలు బాండ్ ను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గంటా గెలిచిన నాటి నుంచి భీమిలి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముందు ఉందని తెలిపారు. చంద్రన్నభీమా, చంద్రన్న పెళ్ళికానుక, ఒంటరిమహిళలకు ఫించన్లు, మత్స్య కారులకు 50ఏళ్ళకే ఫించన్లు, నిరుద్యోగభృతి,తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్, ఎన్టీఆర్ వైద్యసేవలు తదితర పథకాలు అమలు జేసారని అన్నారు. జనన మరణాలు ప్రతీ ఇంట్లో ఉంటాయని కాని కుటుంబ యజమాని మరణిస్తే ఆ ఇంట్లో వారికి ఆసరాగా చంద్రన్న భీమా పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రతీ ఒక్కరూ చంద్రన్నభీమా చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమా మిత్ర పోతిన వెంకటలక్ష్మి, నాయకులు కాసరపు నాగరాజు,మారోజు సంజీవ్ కుమార్, గూడపు రాజు,సత్తరపు శివ, నెక్కిళ్ళ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలను ఆదుకోవడం మానవ ధర్మం

### ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీనువాసరాజు



ఆహార పొట్లాలు పేదలకు పంపిణీ చేసిన ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనువాసరాజు, నిరంజర్

సబ్బవరం : నిరుపేదలను ఆదుకోవడమే మానవ ధర్మ మని సబ్బవరం ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీనువాసరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక మదర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 100మంది నిరు పేదలకు ఆహార పొట్లాలు మంగళవారం స్థానిక స్టేట్ బ్యాట్ దరి పంపిణీ కార్య క్రమం జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధులుగా సబ్ రిజిష్టర్ నిరంజన్ మరియు ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీను వాసరాజు పాల్గొని వారు చేతులు మీదుగా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ ఆహార పొట్లాలు ఆర్థిక సహాయం చేసిన మదర్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వేదూరి సత్యగంగరాజు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఆదుకోవడమే మానవ ధర్మమని అన్నారు.

ఇలాంటి కార్యక్రమంలో అందరూ పాల్గొని నిరుపేదలకు సేవచేయడమే ఉత్తమమైన మార్గమని అన్నారు. ఇటువంటి సేవా కార్య క్రమాలు చేసిన ట్రస్టు అధ్యక్షుడు సత్యగంగ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన ఎంపీపీ



రోగులతో మాట్లాడుతున్న ఎంపిపి సుకల రమణమ్మ

నర్సీపట్నం : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో అందుతున్న సేవలపై నర్సీపట్నం ఎంపిపి సుకల రమణమ్మ మంగళవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. సేవలపై స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నామన్నారు.



**పరవాడ మండలము బొద్దపువానిపాలెం గ్రామం జంక్షన్ లో దుర్గాదేవి అమ్మవారిని పెందుర్తి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బండారు అప్పలనాయుడు,ఎంపిటిసి సభ్యులు డాక్టర్ గొర్లి శ్రీనువాసురావు, తాజా మాజీసర్పంచ్ బొద్దపు నూకరత్నం, మేడిశెట్టి అప్పారావు, అట్టా సన్యాశి అప్పారావు, రొంగలి గోపాలకృష్ణ, మేడిశెట్టి బాలాజీ నాయుడు, రొంగలి పరిదేశినాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.**

## ఘనంగా దేవి నవరాత్రుల ఉత్సవాలు



విజయనగరం: దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక 12వ వార్డు కౌన్సిలర్ పిలకా దేవి , పిలకా శ్రీనుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీని మరియు 1వ వార్డు గాజులరేగ బ్రిడ్జి దగ్గర ఏర్పాటు చేసిన దేవీని వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విజయనగరం నియోజకవర్గం నాయకులు పిళ్ళా విజయకుమార్, అవనాపు విక్రమ్‌లు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని అవనాపు విక్రమ్, ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.సీపి నాయకులు ముల్లు త్రినాద్, పిలకా శ్రీను, రెడ్డి రామ్స్, అలుగోలు ఈశ్వరరావు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ ఏజెంట్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలి

విశాఖపట్నం: రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రభుత్వం పరిశ్రమగా గుర్తించాలని ప్రముఖ రియల్ ఎస్టేట్ విశ్లేషకులు లంకా మోహన్‌రావు అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఏపి రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ సభ, అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేరా చట్టంలో ఖాతాదారులకు, సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా రక్షణ భద్రతా కల్పించాలని, అలాగే ఈ చట్టానికి మరిన్ని సవరణలు చేయాలని ఆయన సూచించారు. రాబోయే కాలంలో ప్రభుత్వం దృష్టికి వినతిపత్రాల ద్వారా ఈ సమస్యలను తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో జె.టి.రామారావు, బాబు, ధర్మారావు, లక్ష్మణరావు, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనువాసరావు, రామకృష్ణ, రామచంద్రమూర్తి, సూర్యపాపారావు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కొవ్వొత్తు ర్యాలీ



నాతవరం : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాతవరం ఎస్సై వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. నిరంతరం ప్రజల రక్షణ కోసం పోలీసు వ్యవస్థ పని చేస్తుందన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు, వైసిపి మండల నాయకులు అంకంరెడ్డి జమీలు, పోలీసులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం



భీమునిపట్నం : భీమిలి లో జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి బాలరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో భీమిలికి చేసిన అభివృద్ధి పనులు గురించి చర్చించారు. రాష్ట్రంలోనూ దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వ వైభవం సాధిస్తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదాకు విశాఖ రైల్వే జోన్ కేవలం కాంగ్రెస్ ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బెహరా భాస్కరరావు, మాజీ వూడా చైర్మన్ రవిబాబు, పి. రమణ కుమారి, భీమిలి కన్వీనర్ కోరాడ.లక్ష్మణ కుమార్, నీలాపు. సురేష్ రెడ్డి, కదిరి జగన్నాథం పాల్గొన్నారు.

# శతశాతం ఇంటింటి నుండి చెత్త సేకరణ నిర్వహించాలి

### - కమిషనర్ హరినారాయణన్

**- చెత్తను ఎక్కడికక్కడ విభజించి కంపోస్ట్‌గా రూపొందించాలి**
**- పారిశుధ్య కార్మికులకు రక్షణ ఎక్విప్‌మెంట్ అందజేయాలి**
**- 30 వేల యుజిడి కనెక్షన్లను అమృత్ ద్వారా ఉచితంగా ఇవ్వండి**
**- యుజిడి లైన్లను యుద్ధప్రాతిపదికన విస్తరించండి**
**- జోన్ల వారీగా అభివృద్ధి, ప్రజారోగ్యంపై సమీక్ష**
**- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వండి.**



విశాఖపట్నం : జివియంసి పరిధిలో శతశాతం ఇంటింటి నుండి చెత్తసేకరణ నిర్వహించేలా చూడాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో అభివృద్ధి, ప్రజా రోగ్యం పై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుండి శతశాతం ఇంటింటి నుండి చెత్త సేకరించేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా చెత్తను ఎక్కడికక్కడ విభజించి కంపోస్ట్ గా రూపొందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికులకు అందజేయవలసిన సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌజ్‌లు తదితర రక్షణ సామగ్రిని అందజేయడానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి ని ఆదేశించారు. అమృత్ పథకం క్రింద 30వేల యుజిడి కనెక్షన్లను అవసరమైన వారికి ఉచితంగా అందజేయాలని కోరారు. అదేవిధంగా యుజిడి లైన్లను విస్తరించి కనెక్ట్ చేయాలని పేర్కొన్నారు. జోన్ల వారీగా అభివృద్ధి, ప్రజా రోగ్యం, ఇంజనీరింగ్ పనులను సమీక్షించి పలు సూచనలు చేశారు.

**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత :** జివియంసికి ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలని ఆదేశించారు. ఆదేవిధంగా ఇ-గవర్నెన్స్ 14 మాడ్యుల్సును తూ.చ. తప్పక అనుసరించి అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, అదనపు కమిషనర్లు జివివియస్ మూర్తి, విజయమనోహర్, టి.సకలారెడ్డి, సిసిపి విద్యుల్లత, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ మంగపతిరావు, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, యస్.ఇలు వేణుగోపాల్, వినయ్, ప్రసాదరాజు, పల్లంరాజు, వెంకటేశ్వరరావు, మరియన్న, జోనల్ కమిషనర్లు, ఇ.ఇలు ఏసిపిలు, ఏ.యం.ఓ.హెచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసుల రక్తదానం

### విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ ఎం.నర్సింహారావు



విజయనగరం: జిల్లాలో ఈ నెల 15 నుండి 21 వరకు నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల వారోత్సవాలలోభాగంగా విజయనగరం జిల్లా ఎస్పీ జి. పాలరాజు గారి ఆదేశాలతో విజయనగరం, బబ్బిలి మరియు పార్వతీపురం సబ్ డివిజన్లలో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లుగా అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు తెలిపారు. విజయనగరం పోలీసు పరేడ్ గ్రౌండు ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చేసిన రక్తదాన శిబిరాన్ని తే. మంగళవారం ముఖ్య అతిధిగా హాజరై, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎం. నర్సింహారావు మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎఆర్ పోలీసు పరేడ్ గ్రౌండులో ఓపెన్ హౌస్‌ను నిర్వహించి, పోలీసులు నిర్వహించే వివిధ రకాలైన విధులు, ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానాలను, వేలిముద్రలు సేకరణ , డాగ్ స్క్వాడ్, డ్రోన్‌ల పనితీరు , పోలీసులు ఉపయోగించే వివిధ రకాలైన ఆయుధాలు తదితర అంశాలపై స్కూలు విద్యార్థులకు అవగాహన కలిగించామన్నారు.సమాజానికి పోలీసులు చేసే సేవా కార్యక్రమాలను ఈ సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. రక్తహీనత కారణంగా ఇబ్బందులకు గురువుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వారికి రక్తాన్ని అందించాలనే లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ రక్తదాన శిబిరంలో విజయనగరం సబ్ డివిజనుకుచెందిన పలువురు ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుళ్లు, ఎస్టీఎఫ్ కానిస్టేబుళ్ళు పాల్గొని పెద్ద ఎత్తున రక్తదానం చేసారు. రక్తదానం చేసిన పోలీసు సిబ్బందికి అదనపు ఎస్పీ పండ్లును, ఫ్రూట్ జ్యూస్‌లనుఅందజేసి, రక్తదానంచేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం. నర్సింహారావు అభినందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ పాల్గొని 80 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ జి. రామకృష్ణ, ఆర్ఐ శ్రీహరిరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి. ప్రసాదరావు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం. రాము, జిల్లా పోలీసు సిబ్బంది, సివిల్, ఎఆర్, ట్రాఫిక్ ఎస్టీఎఫ్ కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

# దుర్గాదేవిని దర్శించుకున్న చొక్కాకుల వెంకటరావు దంపతులు



విశాఖపట్నం: స్థానిక 34వవార్డులో తోపుడు బండ్ల వర్తక సంఘం వారు మార్కెట్ సముదాయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని మరియు స్థానిక కనకదుర్గ ఆటోస్టాండ్ వారు ఏర్పాటు చేసిన దుర్గాదేవిని మంగళవారం వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షులు చొక్కాకుల వెంకటరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ మాత అయిన దుర్గాదేవి మనందరిని చల్లగా చూడాలని, అలాగే మన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019వ సంవత్సరంలో ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని కోరానన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీను, కార్యవర్గం సభ్యులు, కనకదుర్గా ఆటోస్టాండ్ ప్రతినిధులు, వైయస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి రోడ్లు లేని నగరంగా విజయనగరం



విజయనగరం : పట్టణాన్ని మట్టిరోడ్లు లేని నగరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలసి మున్సిపల్ చైర్‌పర్సన్ పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే రోడ్లు, కాలువలు వేయడానికి ప్రణాళికలను సిద్ధం చేయమని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ షిప్ పథకంలో భాగంగా విజయనగరం పురపాలక సంఘానికి 182 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలియజేశారు. పట్టణంలో రోడ్లు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పట్టణ వ్యాప్తంగా కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. పట్టణంలో ఎక్కడైనా రోడ్లు, కాలువలు లేని ప్రాంతాలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇ మత్స్యరాజు, ఎఇ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్‌సీ మీటింగ్‌లో పుదుచ్చేరి ప్రతిపాదనలు

### యానాం జిప్‌మేర్ రెండవ దఫాకు రూ. 52 కోట్లు మంజూరు

### మంత్రి మల్లాడి క్రిష్ణారావు



యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి రాష్ట్రానికి సంబంధించిన ఆరోగ్యశాఖ అంశాలపై స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ (ఎస్ఎఫ్‌సి) సమావేశంలో చర్చించారు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వెళ్ళిన ఆయన ఎస్ఎఫ్‌సి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో యానాం నియోజకవర్గంలో నిర్మించనున్న జిప్‌మేర్ బ్రాంచ్‌కు సంబంధించి రెండవ దఫా పనులు నిమిత్తం రూ. 65.80 కోట్లు మంజూరు చేశారు. దీనితోపాటు పుదుచ్చేరి, కారైకాల్, యానాం జిప్‌మేర్ బ్రాంచ్‌లకు సంబంధించిన సిబ్బంది నియామకానికికేంద్ర ఆరోగ్యశాఖ అనుమతిచ్చిందన్నారు. ఆదేవిధంగా 50 పడకల ఆయూష్ ఆసుపత్రికి సంబంధించి టోకెన్ బడ్జెట్‌లో రూ. 36 లక్షలు, పుదుచ్చేరి లోని విల్లునూర్‌లో ఆయూష్ ఆసుపత్రి నిర్మాణానికి రూ. 2.67 కోట్లు నిధులు ఇవ్వడం జరిగిందని, దీనికి సంబంధించి యూసీ సమర్పించిన అనంతరం మరో రూ. 2 కోట్ల మేర నిధులు కావాలని ప్రతిపాదించారు. వీటికి సంబంధించి డీపీఆర్ సవరణతోపాటు సిబ్బంది నియామకానికి సంబంధించి పలు అంశాలను త్వరితగతిన కేంద్ర ఆరోగ్యశాఖకు పంపాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ అధికారులను సూచించారు. జిప్‌మేర్ బ్రాంచ్‌కు నిధులు కేటియించడం పట్ల యానాం ప్రజల తరుపున కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపీ నడ్డా, కార్యదర్శి ప్రీతిసుదన్, అదనపు కార్యదర్శి సింగాల్, పుదుచ్చేరి సిఎం నారాయణస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అశ్విన్‌కుమార్‌లకు పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి క్రిష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీకాకుళంలో సంత్ నిరంకారి చార్టిబుల్ ఫౌండేషన్ సేవాలు





విశాఖపట్నం: ఇటీవల కేరళలో జరిగిన వరద బీభత్సం మరవక ముందే మళ్ళీ ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని శ్రీకాకుళం జిల్లా మరోసారి ప్రకృతి విలయతాడం చేసింది. తిత్లి తుపాను కారణంగా శ్రీకాకుళం అట్టడుగుపోయింది. తిత్లి తుఫానుకి చలించిన సంత్ నిరంకారి చార్టిబుల్ ఫౌండేషన్ అక్కడ జరిగిన ప్రమాదాన్ని అంచనా వేసి విశాఖపట్నం నుండి సుమారుగా 40 మంది సేవాదళ్ సభ్యులు వెళ్ళి అక్కడ సేవలు అందిచారు. పలాసకి 17 కిలోమీటర్ దూరంలో ఉన్న మారుమూల గ్రామాల్లోకి వెళ్ళి అక్కడ రోడ్లు అడ్డుగా ఉన్న వృక్షలును మరియు పేరుకుపోయిన చేత్తను తీసివెయ్యడం జరిగింది. అంతే కాకుండా 3 రోజులు పాటు చుట్టూ పక్కలా గ్రామాలకు అన్నదానం చేయడం జరిగింది . మరియు నిత్యావసరాలను పంపణీ చేయడం, విశాఖపట్నం నుండి తీసుకువచ్చిన జనరేటర్ ద్వారా కరెంట్ సరఫరా చేయడం, మోటార్ ద్వారా మంచి నీటిని సరఫరా చేశారు. చుట్టు పక్కలా ఉన్న ప్రాధిమికా పాఠశాలలో పడిపోయిన వృక్షలును చేత్తను తొలగించి శుభ్రం చేశారు. సంత్ నిరంకారి చార్టిబుల్ ఫౌండేషన్ సేవాదళ్ సభ్యులు ఆంధ్రప్రదేశ్ క్షేత్రీయ సంచలక్ రవి, విశాఖపట్నం సేవాదళ్ సంచలక్ రాజవీర్, విశాఖపట్నం సేవాదళ్ మహిళ శిక్షక్ రీతా , సురేశ్చంద్ర, మూర్తి మరియు విశాఖపట్నం సేవాదళ్ సభ్యులు (40) మంది పాల్గొన్నారు.

# నేడు జర్నలిస్టుల దసరా సంబరాలు సాంస్కృతిక సందడి




విశాఖపట్నం : నిరంతరం మానసిక ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆటవిడుపును కలిగించేందుకు గాను ఈ నెల 17వ తేదీ బుధవారం సూర్యాబాగ్‌లోని వైశాఖి జల ఉద్యానవనంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్‌ల ఫెడరేషన్, మహావిశాఖ నగర శాఖ దసరా సంబరాలను నిర్వహిస్తున్నట్టు ఏ.పి.డబ్యూజె.ఎఫ్. రాష్ట్ర కార్యదర్శిగంట్ల శ్రీనుబాబు, నగర శాఖ అధ్యక్షులు పి. నారాయణ్ తెలియజేశారు. మంగళవారం ఉదయం సీతమ్మధార నార్ల వెంకటేశ్వరభవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అల్పాహారం నుంచి ప్రారంభమై తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అనంతరం లక్కీడిప్‌తో పాటు అతిధుల చేతుల మీదుగా పలువురికి బహుమతులు అందచేస్తామన్నారు. మధ్యాహ్నం విందు అనంతరం మిఠాయిలు పంపిణీ చేయనున్నట్టు వివరించారు.

కార్యక్రమంలో మంత్రి గంటా శ్రీనివాసరావుతో పాటు పలువురు అతిధులు హాజరుకానున్నారని తెలిపారు.. కావున జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ దసరా సంబరాల్లో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విశాఖపట్నంతోపాటు మధురవాడ, భీమిలి, పద్మనాభం, గోపాలపట్నం సింహాచలం, పెందు ర్తి, గాజువాక, పరవాడ ప్రాంతాల నుంచి జర్నలిస్టులు ఈ సంబరాల్లో పాల్గొననున్నట్టు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎ.పి.డబ్ల్యూ. జె.ఎఫ్. కార్యదర్శి అనురాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్, కోశాధికారి ఎ. సాంబ శివరావుతో పాటు ఎ.పి. బ్రాడ్‌కాస్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అశ్వ వాహనం

యానాం: శ్రీభూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అశ్వ వాహనాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం శ్రీవెంకటేశ్వర దేవాలయం వద్ద క్షత్రియపరిషత్ ఆధ్వర్యంలో అశ్వ వాహనంపై మీసాల వెంకన్నను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల సమ క్షంలో పూజలు నిర్వహించారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు మున్సిపల్ కమీషనర్ జి. గౌరి సరోజ, ఎన్.పి. నితిన్ గోహల్, దేవస్థాన కమిటీ చైర్మన్ కె. ఉమాశంకర్‌లు ప్రత్యేక పూజల అనంతరం వాహనాన్ని ఊరేగించారు. బాణాసంచ కాల్పులు, వివిధ సాంస్కృతి కార్యక్రమాలనడుమ స్వామి యానాం పురవీధులలో ఊరేగించారు. అడుగడుగునా వెంకన్నకు భక్తులుపూజలు నిర్వహించారు. రాత్రి 12 గంటలకు పవళింపు సేవతో ఉత్సవం ముగిసింది. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ నాయకులు భూపతిరాజు రామురాజు, వి. భాస్కరరాజు, కె.సూర్యనారాయణరాజు, కమిటీ సభ్యులు భక్తులు, తదితరుల పాల్గొన్నారు.

# డ్రైనేజ్‌లను పరిశుభ్రం చేయాలి ప్రజలు డిమాండ్

యానాం: పట్టణ ప్రాంతంలోని ప్రధాన డ్రైనేజ్ మార్గాలు కలుషిత వ్యర్థాలతో పెరుకుపోయి దుర్గంధ వెదజల్లుతుందని వీటిని పరిశుభ్రపరిచేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ డ్రైనేజ్‌ల నుండి రాత్రుళ్ళు విపరీతంగా దోమలు సంచరించడంవలన వ్యాధుల భారిన పడుతున్నామని వీటిని నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ సిబ్బంది ఈ డ్రైనేజ్‌లను పరిశుభ్రం చేసే పనులు చేపట్టడంలేదని దీనివలన ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. మున్సిపల్ కమీషనర్ ఈ డ్రైనేజ్ పరిస్థితులనుశ్రీన పరిశీలించిన పాపాన పోలేదన్నారు. ఆఫీసుకు పరిమితమై కాలం వెళ్లిబుచ్చుతున్నారని ఈ దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టకపోతే ప్రమాదకరమైన వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో ఈ డ్రైనేజ్‌లు పరిశుభ్రంచేసినప్పుడు బీచింగ్ పౌడర్, ఇతర మందులు పిచికారి చేసేవారని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. గతంలో చేసిన మాదిరిగానే ఆ పనులు చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

### నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,000/- విరాళము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి విశాఖపట్నం జిల్లా చినగంట్యాడకు చెందిన గొంపా.శ్రీనివాసరావు రూ1,00,000/- విరాళమును ఏఈవో ప్రసాద్‌కి అందజేసి ప్రతీ సంవత్సరం దానిపై వచ్చు వడ్డీతో జూన్ 15వ తేదీన గొంపా. అప్పలస్వామి పేరున అన్నదానం జరిపించవలెనని కోరారు.

# శ్రీ ప్రత్యంగిరా దేవీ అలంకారములో అమ్మవారు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్ర ము అన్నవరంలో దేవస్థానం ఉద్యోగుల సంఘం ఆద్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా మంగళవారం దుర్గమ్మవారు శ్రీ ప్రత్యంగిరా దేవీ అలంకారములో భక్తులకు దర్శనము ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు అమ్మవారిని దర్శించు కొన్నారు. అమ్మవారి ఆలయంలో ఉదయం అష్టోత్తర శతనామ పూజ, సాయంత్రం సువాసిను లచే విశేష కుంకుమార్చన రాత్రి 8 గం.లకు నీరాజన మంత్ర పుష్పములు అనంతరం భక్తు లకు తీర్ధ, ప్రసాద వితరణ నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వైదిక కార్యక్రమాలను దేవ స్థానం పిర్వో తులా.రాముడు పర్యవేక్షిస్తున్నారు.

# బైబిల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



విశాఖపట్నం : బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ ఆగ్జిలరీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరంలోని పాత జైల్ రోడ్ కూడలి సమీపాన గొల్లలపాలెం ఐపీసీ చర్చ్‌లో ప్రారంభమైంది. మూడు రోజులపాటు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ తెరచి ఉంచే ఈ బైబిలు ప్రదర్శనలో తెలుగు బైబిళ్లపై 10 నుంచి 40 శాతం, ఆంగ్ల బైబిళ్ల సంబంధిత పుస్తకాలపై 10 నుంచి 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఆగ్జిలరీ అధ్యక్షులు ఎం. జాన్సన్ లాంఛనంగా రిబ్బన్ కత్తిరించి ఈ ప్రదర్శనను ప్రారంభించారు.

బాలల కోసం రూపొందించిన బొమ్మల బైబిళ్లు, స్వల్ప ఖరీదైన బైబిళ్లు మొదలుకొని అనేక రిఫరెన్స్, పెద్దలు చదువుకోవడానికి వీలైన ఫాంట్‌లో ముద్రించిన పరిశుద్ధ గ్రంధాలు, బైబిలు నిఘంటువులు, అరుదైన క్రైస్తవ సాహిత్యం ఒకే చోట ఏర్చి కూర్చి ఈ ప్రదర్శన నిర్వహిస్తున్న స్థానిక పెద్దలను ఈ సందర్భంగా ముఖ్య అతిథి జాన్సన్ అభినందించారు. సంస్థ ఏపీ ఆగ్జిలరీ కార్యదర్శి బి. శామ్యుల్ రాజశేఖర్, తెలంగాణ ఆగ్జిలరీ కార్యదర్శి జాన్ బేసీ పాల్, విశాఖపట్నం ప్రధాన శాఖ అధ్యక్షులు ఆచార్య వి. అబ్రహాం, వైజాగ్ ఈస్ట్ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ జి. ఐజయా, స్టీల్ సిటీ బ్రాంచ్ కార్యదర్శి పీసీహెచ్ అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగర ప్రజలంతా మూడు రోజులపాటు నిర్వహించే ఈ బైబిలు ప్రదర్శన, అమ్మకాల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఎస్. ఇమ్మానుయేల్ ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మత్స్యకారులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విశాఖపట్నం: పేద మత్స్యకారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. 50 నుంచి 75 శాతం సబ్సిడీతో బోట్లు, వలలు, ఇంజిన్లు, ఇతర పరికరాలను అందచేస్తుందన్నారు. చింతపల్లి తాతారావు అనే మత్స్యకారునికి సబ్సిడీతో రూ. 5 లక్షల ఖరీదుచేసే బోటు, వలలు, ఇంజిన్‌ను ఎమ్మెల్యే అందచేశారు. ఇటీవల ఫిషింగ్ హార్బర్లో ప్రమాద వశాత్తు మరణించిన మత్స్యకారుని కుటుంబానికి స్వంత నిధులు రూ. 5 వేలు అందచేశారు. బోట్లలో పనిచేసే కలాసీలకు సబ్సిడీతో బోట్లు అందచేస్తామని బోటు ఓనర్లుగా మారాలని విజ్ఞప్తిచేశారు. ఎడి లక్ష్మణరావు, ఎఫ్‌డిఒ విజయ, పిసి అప్పారావు, మున్నం బాలాజీ, బర్రి కొండబాబు, వలిశెట్టి తాతాజీ, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో అధికార్లు ప్రజా ప్రతినిధులు సమన్వయం పాటించాలి



ఆత్రేయపురం : ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం పాటించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి కోట చెల్లయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిధిగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికి సంక్షేమ పథకాల అమలు చేస్తూ కొత్త పథకాలకు రూపకల్పన చేసి కార్యాచరణ రూపొందిస్తున్నారని అన్నారు. ప్రతి సర్వ సభ్య సమావేశానికి సభ్యులు అధికారులు విధిగా హాజరై గ్రామ సమస్యలు తెలియజేయడం వల్ల పరిష్కారం లభ్యమవుతుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అధికారులు ప్రజలకు మరింత చేరువ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో కోట్ల రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఇంకనూ మిగిలి ఉన్న పనులకు త్వరలో ప్రారంభోత్సవాలు చేస్తామని అన్నారు. మండల తహాశీల్దారు కార్యాలయంలో అవినీతి జరుగుతుందని ఎంపిపి కోట చెల్లయ్య ఆరోపించగా దానికి ఆర్ఎస్ స్పందిస్తూ ఇటువంటి దుశ్చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తహాశీల్దారు జి. వేంకటేశ్వరరాజు స్పందిస్తూ సర్టిఫికెట్ జారీల ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, తమ ఆఫీసులో అటువంటి వాటికి తావులేదని ఎవరైనా అతిక్రమిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వైస్ ఎంపిపి దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు తమకు సమాచారం ఇవ్వడంలేదంటూ ప్రభుత్వ పథకాలకు మేము అడ్డుకాదని, అభివృద్దే ధ్యేయంగా మేము పనిచేస్తామన్నారు. అలాగే జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్‌సి ఏరియాల్లో డ్రైను పూర్తి స్థాయిలో స్థంభించాయని, డ్రైన్లు శుభ్రపరచాలని, గుంతలు పూడ్చి రోడ్లు పునరుద్ధరించాలన్నారు. ఎంపిటిసి కొండేపూడి రామకృష్ణ మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టిలకు గృహనిర్మాణ శాఖ ద్వారా 50 వేలు పెంపుపై వివరణ అడుగగా 2016 ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో నిర్మాణం చేసుకున్న వార్కి ఈ స్కీము వర్తిందని వివరణ ఇచ్చారు. రావులపాలెం వాణిజ్య పరంగా ఎంతో అభివృద్ధి చెంది, అన్ని కార్యాలయాలు కలిగి ఉండి ఆర్ధిక పరంగా ఎంతో వృద్దిలో ఉందని, అందుచే రావులపాలెంలో ఫైర్ ఆఫీసు, సబ్ ట్రెజరీ ఆఫీసులు ఏర్పాటు చేయాలని, వీటికోసం కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవలసి వస్తుందని ఆరోపిస్తూ ఆర్ఎస్‌కు వినతిపత్రం అందించగా ఆర్ఎస్ స్పందిస్తూ వీటికి సంబందించి ఆయా శాఖల మంత్రులతో చర్చించి వేగవంతంగా పనులు చేసేందుకు వచ్చే సమావేశానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రత్యేకాధికారులు సమస్యలను గుర్తించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రత్యేకాధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని, ఈ శిక్షణతో గ్రామ సమస్యలు అవగాహన చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి. జగదాంబ, సూపరింటెండెంట్ జి. రాజేంద్ర ప్రసాద్, వివిధ శాఖల అధికార్లు, గ్రామ కార్యదర్శులు, రెవిన్యూ అధికార్లు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## శూర్పణఖ పాత్రలో...?



స్టార్ హీరోయిన్ సమంత... వివాహం తర్వాత ఎంచుకునే సినిమాలు, కథల విషయంలో చాలా మార్పు కనిపిస్తోంది. హీరో పక్కన పెద్దగా ప్రాధాన్యం లేని పాత్రలు చేయడం కంటే తన పాత్రకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఉంటేనే పాత్రలు చేయడానికే ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. దీంతో పాటు 'యూ టర్న్' లాంటి ప్రయోగాత్మక సినిమాలూ చేస్తున్నారు.

తాజాగా సమంత మరో ప్రయోగాత్మక సినిమాలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. పౌరాణిక పాత్రలో నటించడానికి ఓకే చెప్పిందని, ఇది నెగెటివ్ పాత్ర అయినప్పటికీ పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ కావడంతో ఒప్పుకుందని తెలుస్తోంది.

యానిమేషన్ చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న భార్గవ్ అనే ఫిల్మ్ మేకర్ రామాయణం ఆధారంగా తెరకెక్కించే పౌరాణిక సినిమాలో సమంత శూర్పణఖ పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్. నెగెటివ్ రోల్ సమంత ఒప్పుకోవడానికి కారణం? ఈ సినిమా శూర్పణఖ కోణంలో సాగుతుందని తెలుస్తోంది. ఇది నెగెటివ్ పాత్ర అయినప్పటికీ పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్ కావడం, తానే కీలక పాత్రధారి కావడంతో సమంత ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నారట. గతంలో కాజల్ పేరు గతంలో ఈ పాత్ర హీరోయిన్ కాజల్ చేయబోతోందనే వార్తలు వినిపించాయి. ఇప్పుడేమో సమంత పేరు తెరపైకి వచ్చింది. అయితే చిత్ర బృందం నుంచి అఫీషియల్ సమాచారం రావాల్సి ఉంది. సమంత సినిమాలు ప్రస్తుతం సమంత తమిళంలో సూపర్ డిలక్స్ అనే చిత్రంతో పాటు.... తెలుగులో నాగ చైతన్యతో కలిసి ఓ సినిమా చేస్తున్నారు. కాగా.. ఇటీవల విడుదలైన సమంత చిత్రం యూ టర్న్ బాక్సాఫీసు వద్ద యావరేజ్‌గా ఫలితాలు సాధించిన సంగతి తెలిసిందే.

### ఎన్టీఆర్ కోసం వెతకండి:

## రూ. 10 లక్షలు ప్రకటించిన రామ్ గోపాల్ వర్మ!




వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తను తీయబోయే 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమా కోసం పాత్రల ఎంపికపై సీరియస్‌గా ఫోకస్ పెట్టారు. ఇందులో ముఖ్య పాత్రల కోసం అచ్చం వారిని పోలి ఉండే వారి కోసం వెతుకుతున్న వర్మ... ఇటీవలే చంద్రబాబు నాయుడిలా ఉండే వ్యక్తిని కనుగొన్న సంగతి తెలిసిందే. చంద్రబాబులా ఉన్న వ్యక్తి ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఆతడి ఆచూకి కోసం ప్రయత్నించిన వర్మ... రోహిత్ అనే వ్యక్తి ద్వారా అతడి సమాచారం కనుక్కున్నాడు. తనకు హెల్ప్ చేసిన రోహిత్‌కు రూ. లక్ష బహుమతి కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇపుడు ఈ స్టార్ డైరెక్టర్ సీనియర్ ఎన్టీఆర్ ను పోలి ఉండే వ్యక్తి కోసం వెతుకులాట ప్రారంభించారు.

లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కోసం రామ్ గోపాల్ వర్మ ఇప్పటికే ముగ్గురిని షార్ట్ లిస్ట్ చేశాడు. అయితే ఇటీవల చంద్రబాబును పోలిన వ్యక్తి దొరకడంతో... వర్మలో మరింత నమ్మకం పెరిగింది. ఎన్టీఆర్ మాదిరిగా ఉండే వ్యక్తి దొరికే అవకాశం ఉందని అతడి కోసం వెతకడం ప్రారంభించారు. సోషల్ మీడియా లో ఆర్.జి .వి బంపర్ ఆఫర్ రూ. 10 లక్షలు బహుబతి ప్రకటించిన వర్మ లక్ష్మి పార్వతిని కలిసిన సమయంలో ఎన్టీఆర్ ఎలా ఉన్నాడో అలాంటి లుక్‌తో ఉన్న వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే మాకు ఫొటోలు, వీడియోలు పంపండి. అతడు ఎన్టీఆర్ మాదిరిగా ఉండటంతో పాటు అయనలా మాట్లాడే టాలెంట్ కూడా ఉంటే మాకు సమాచారం అందించండి. వారికి రూ. 10 లక్షలు బహుబతి అందిస్తాను అని వర్మ తెలిపారు. టాలీవుడ్లో వర్మ మరో సంచలనం లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమా



ద్వారా టాలీవుడ్లో మరో సంచలనం క్రియేట్ చేయడానికి రామ్ గోపాల్ వర్మ ప్రయత్నిస్తున్నారు. ఈ మూవీ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మి పార్వతి కోణంలో ఉంటుందని అతడు చెప్పడంతో ఇందులో ఏం చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. వర్మ మామూలోడు కాదు కదా లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమాలో వర్మ ఎవరిని నెగెటివ్‌గా చూపిస్తాడు? ఎవరిని పాజిటివ్‌గా చూపిస్తాడు? చంద్రబాబుకు వ్యతిరేకంగా ఈ సినిమా ఉంటుందా? లక్ష్మి పార్వతికి అనుకూలంగా స్టోరీ ఉంటుందా? అంటే.... ఇవేవీ ఉండవని చెప్పక తప్పదు. ఈ సినిమా ద్వారా వర్మ తనదైన వెర్షన్ వినిపిస్తాడని తెలుస్తోంది.

## రైతు పాత్రలో నాని

తెలుగు చిత్రసీమలో పాత్రలు, కథాంశాల పరంగా వైవిధ్యతకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చే కథానాయకుల్లో నాని ఒకరు. ఇటీవలే నాగార్జునతో కలిసి నటించిన మల్టీస్టారర్ చిత్రం దేవదాస్‌తో చక్కటి విజయాన్ని అందుకున్నారాయన. తాజాగా నాని రైతు పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గ్రామీణ నేపథ్య కథాంశంతో కిశోరుడు అనే నూతన దర్శకుడు నానికి ఓ కథను వినిపించినట్లు తెలిసింది. దర్శకుడు చెప్పిన కథలోని నవ్యత ఆకట్టుకోవడంతో నాని ఈ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో రైతుగా నాని పాత్ర సరికొత్త పంథాలో సాగనున్నట్లు తెలిసింది. 14 రీల్స్ ప్లస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం నాని జెర్సీ సినిమాలో నటించబోతున్నారు. ఇందులో క్రికెటర్‌గా కనిపించనున్నారాయన. గౌతమ్



తిన్ననూరి దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌పైకి రానుంది.



## జోధ్‌పూర్‌లో వివాహం



పాప్‌గాయకుడు నిక్‌జోనస్, బాలీవుడ్ భామ ప్రియాంకచోప్రా జంట ఇటీవలే నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. త్వరలో వీరిద్దరు వివాహబంధంతో ఒక్కటికాబోతున్నారు. పెళ్లివేడుకను వైభవంగా నిర్వహించడానికి ప్రియాంకచోప్రా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌ను పెళ్లి వేదికగా నిర్ణయించారు. నవంబర్ మాసంలో అక్కడి చారిత్రక ఉమేద్‌భవన్‌లో వివాహం జరగనుంది. ఇటీవలే ప్రియాంకచోప్రా, నిక్‌జోనస్ జోధ్‌పూర్‌ను సందర్శించి వివాహ ఏర్పాట్ల గురించి చర్చించారు. పెళ్లికి ఇరు కుటుంబానికి సంబంధించిన రెండొందల మంది అతిథుల్ని మాత్రమే ఆహ్వానిస్తారని సమాచారం. వివాహానంతరం హాలీవుడ్ సెలబ్రిటీస్ కోసం న్యూయార్క్‌లో గ్రాండ్ రిసెప్షన్‌కు సన్నాహాలు చేస్తున్నారు.

బాలీవుడ్ ప్రముఖుల కోసం ముంబయిలో విందు ఏర్పాటు చేస్తారని సమాచారం. హాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన అనంతరం ప్రియాంకచోప్రా గ్లోబల్‌స్టార్‌గా గుర్తింపును సంపాదించుకుంది. దాంతో ఈ సుందరి పెళ్లి వేడుక కోసం విదేశీ మీడియా సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ఈ నేపథ్యంలో చారిత్రక నగరం జోధ్‌పూర్‌లో పెళ్లి వేదికను ఎంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నవంబర్ ద్వితీయార్థంలో పెళ్లికి తేదిని నిర్ణయించారని తెలుస్తున్నది. ప్రస్తుతం ప్రియాంకచోప్రా బాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటున్నది. హాలీవుడ్‌లో ఇజ్ ఇన్ట్ ఇట్ రొమాంటిక్ ది స్కై ఈజ్ పింక్ అనే చిత్రాల్లో నటిస్తున్నది.

## ధైర్యంగా ముందుకురండి!



మీటూ ఉద్యమానికి భాషాభేదాలకు అతీతంగా మద్దతు లభిస్తున్నది. దక్షిణాది అగ్రనాయకానాయికలు బాధితులకు అండగా ఉంటామని భరోసానిస్తున్నారు. సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్, విశాల్ మీటూకు బాసటగా ఉంటామని తెలిపారు. వేధింపులపై ఫిల్మ్‌ఛాంబర్‌లో ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సమంత పిలుపునిచ్చింది

**భయపడాల్సిన అవసరం లేదు - సమంత**

మీటూ ఉద్యమానికి ప్రముఖ కథానాయిక సమంత పూర్తి మద్దతు ప్రకటించింది. లైంగిక వేధింపులకు గురైన వారు ధైర్యంగా ముందుకురావాలని పిలుపునిచ్చింది. ఫిర్యాదు చేసిన వారి పేరు గోప్యంగా ఉంటుంది కాబట్టి బయపడాల్సిన అవసరం లేదని చెప్పింది. వేధింపులకు వ్యతిరేకంగా గళం విప్పండి. ఫిల్మ్ ఛాంబర్ హైదరాబాద్ కార్యాలయానికి ఫిర్యాదుల్ని పంపించండి అని సమంత పేర్కొంది. తొలి నుంచి మీటూ ఉద్యమానికి అనుకూలంగా సమంత సోషల్‌మీడియాలో తన అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నది.

**సోషల్‌మీడియాకు థాంక్స్ - రకుల్‌ప్రీత్‌సింగ్**

చిత్ర పరిశ్రమలో వేధింపులకు గురైన మహిళలు ధైర్యంగా ముందుకురావడం శుభపరిణామమని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. మీటూ ఉద్యమం సత్ఫలితాలనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. మీటూ విస్తృతంగా ప్రచారం పొందడం ఆనందంగా ఉంది. దీనివల్ల మంచి మార్పువస్తుందని ఆశిస్తున్నాను. పనిచేసే ప్రదేశాలు మహిళలకు సురక్షితంగా ఉండాలి. అయితే మీటూని దుర్వినియోగం చేయకుండా నిజాయితీగా న్యాయం కోసం పోరాడాలి అని చెప్పింది. ప్రస్తుతం రకుల్‌ప్రీత్‌సింగ్ బాలీవుడ్‌లో లవ్‌రంజన్ దర్శకత్వంలో దేదే ప్యార్‌దే అనే చిత్రంలో నటిస్తున్నది. ఇటీవలే దర్శకుడు లవ్‌రంజన్‌పై ఓ మహిళ లైంగిక ఆరోపణలు చేశారు. ఈ విషయమై రకుల్‌ప్రీత్‌సింగ్ స్పందిస్తూ దర్శకుడు లవ్‌రంజన్ అందరితో బాగుండేవాడు. ఆయనపై ఆరోపణలు రావడం ఒక్కసారిగా షాక్‌కి గురిచేసింది అని పేర్కొంది.

**బాధితులకు అండగా ఉంటాం- విశాల్**

మీటూ ఉద్యమంలో మహిళలకు బాసటగా నిలుస్తామని తమిళ హీరో విశాల్ ప్రకటించారు. అవసరమైతే వారికి భద్రత కల్పించడానికి ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిశ్రమలోని మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి మాట్లాడండి. వారికి అండగా మేముంటాం. భద్రత కోసం ఓ కమిటీని నియమిస్తాం. వేధింపులను బయటపెట్టిన మహిళలను మేమెంతగానో గౌరవిస్తున్నాం. అమలాపాల్‌కు ఓ సందర్భంలో వేధింపులు ఎదురైతే ఆమె మాకు సమాచారం అందించారు. మేం వెంటనే రంగంలోకి దిగి సహాయం చేశాం అంటూ విశాల్ ట్వీట్ చేశారు.

**విక్కీకౌశల్ తండ్రిపై ఆరోపణలు..**

మీటూ సెగ బాలీవుడ్ నటుడు విక్కీకౌశల్ కుటుంబానికి తాకింది. మసాన్, రాజీ, సంజు సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్నారు విక్కీకౌశల్. ఆయన తండ్రి శామ్ కౌశల్ ఫైట్‌మాస్టర్‌గా పలు బాలీవుడ్ సినిమాలకు పనిచేశారు. ఓ సినిమా చిత్రీకరణలో శామ్‌కౌశల్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు నమితా ప్రకాష్ అనే అసిస్టెంట్ డైరెక్టర్ ఆరోపించారు. అవుట్‌డోర్ షుటింగ్‌లో ఉండగా వొడ్కా తాగడానికి శామ్ తనను రూమ్‌కు ఆహ్వానించారు. ఆయన ఆహ్వానాన్ని నేను తిరస్కరించాను. ఆ తర్వాత తన ఫోన్‌లో ఓ పోర్న్ వీడియోను నాకు చూపించారు అని తెలిపింది. నమితా ప్రకాష్ ఆరోపణలపై శామ్ కౌశల్ క్షమాపణలు చెప్పారు.

## యా దేవి సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా..

- లక్ష్మీదేవిని ఆరాధించి ధనాన్ని పొందండి
- శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



పెందుర్తి: మహాలక్ష్మీ నమస్తుభ్యం.. సమస్తుభ్యం సురేశ్వరి.. హరిప్రియే నమస్తుభ్యం.. నమస్తుభ్యం దయానిధే.. అని లక్ష్మీదేవిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లైతే అమ్మ కరుణించి కోరిన ధనధాన్యాదులనొసగగలదని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి పేర్కొన్నారు. విశాఖ శ్రీ శారదా పీఠ ప్రాంగణంలో అమ్మవారిని శరన్నవరాత్రుల సందర్భంగా ఏడవ రోజున శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిగా భక్తిశ్రద్ధలతో కొలిచారు. శ్రీ శారదా పీఠ ప్రాంగణంలో శ్రీ శారదా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా తొలుత గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచన కార్యక్రమాలతో ప్రారంభించి అనంతరం అమ్మకు లక్ష్మీదేవిగా అలంకరించి విశేష పూజలు గావించారు. మహా పండితులచే శ్రీచక్రార్చన విశేషంగా గావించారు. ఈ సందర్భంగా భక్తజనులనుద్దేశించి శ్రీచరణులు ప్రసంగిస్తూ కమలాలను రెండు చేతులతో ధరించి వరద, అభయ హస్త ముద్రలను ప్రదర్శిస్తూ గజరాజులు సేవిస్తుండగా శ్రీ మహాలక్ష్మి రూపంలో అమ్మ దర్శనమిచ్చింది. అనంతరం చండీహెూమాన్ని వైభవోపేతంగా పండితులు నిర్వహించారు. సాయంత్రం మహిళలందరూ సామూహిక కుంకుమ పూజలలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం సువాసినీ పూజ కూడా నిర్వహించారు. స్వామి వారు అమ్మవారికి ఏకాదశ హారతులు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## తీరప్రాంత సంరక్షణపై ప్రజాభిప్రాయసేకరణ

### కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పిస్తాం .. విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖ సిటీః తీర ప్రాంత సంరక్షణ చట్టంపై (కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్) ప్రజాభిప్రాయ సేకరణ గావించి సంబంధిత నివేదికను తుదిగా కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వుడా చిల్డ్రన్ థియేటర్‌లో సిఆర్‌జెడ్ నోటిఫికేషన్ ప్లాన్‌పై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ హైకోర్టు, సుప్రీం కోర్టు, సిఆర్‌జెడ్ ఉల్లంఘనపై నోటిఫికేషన్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. పాల్గొన్న వారి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించి సంబంధిత నివేదికను పంపడం జరుగుతుందన్నారు. 2011 సంవత్సరంలో నోటిఫికేషన్ వచ్చిన తరువాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ప్రపోజల్స్ ప్లాన్‌ను తయారు చేయడం జరిగిందన్నారు. ఈ ప్లాన్‌ను వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందన్నారు. తీర ప్రాంతంలో ఉన్న ప్రజలను తుపాను, ఆపద సమయాలలో ఎలా రక్షించాలో ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. సముద్రంలో అలల ఆధారంగా ఈ కోస్టల్ మ్యాప్‌ను తయారు చేయడం జరిగిందన్నారు.

ఈ మ్యాప్ ద్వారా సముద్రతీర ప్రాంతాల అభివృద్ధికి మంచి అవకాశం కలుగుతుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతం 528 కిలో మీటర్లు పొడవు వున్నదని, దీనిపై ప్రజాభిప్రాయసేకరణ చేయడం జరిగిందని అన్నారు. పలు ప్రజా సంఘాల ప్రతినిధులు లోకనాథం, డి.పాల్, ఎం. పైడిరాజు, వాసుపల్లి శ్రీనివాసరావు, జానకిరావు, అప్పలరాజు, ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ సాంబశివరావు, హెచ్‌పిసిఎల్ అధికారి వైవిఎస్ శర్మ తదితరులు మాట్లాడుతూ సిఆర్‌జెడ్ ప్లాన్ చట్టవ్యతిరేకంగా ఉన్నదని, మత్స్యకార గ్రామాలు నాశనమై ప్రజలు అన్యాయానికి గురౌతున్నారని అన్నారు. ప్రజల జీవన భృతికి చెందిన అంశం కావున మత్స్యకారులను ఆదుకొని వారికి కావలసిన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిఎంఆర్‌డిఎ కమిషనర్ బసంత్ కుమార్, సిఆర్‌జెడ్ ప్రభావిత గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

## రక్తదానం ప్రాణదానమే

### డీజీపీ ఆర్‌పీ ఠాకూర్



విశాఖ సిటీః సచ్ఛందంగా రక్తదానం చేయడమంటే పరోక్షంగా ప్రాణదానం చేసినట్లేనని డీజీపీ ఆర్.పి. ఠాకూర్ తెలిపారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం పోలీసు బ్యారెక్స్‌లో కల్యాణ మండపంనందు డీజీపీ చేతులమీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలలో చాలామంది క్షతగాత్రులు రక్తం బాగా పోయి ప్రాణాలు సైతం పోగొట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి అక్కడ అవసరమైన రక్తదానం చేసినట్లైతే వారు బతికే అవకాశం ఉంటుందని తెలిపారు.

కావున యువకులు, ఆరోగ్యవంతులందరూ తప్పనిసరిగా స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహష్ చంద్ర లడ్హా, నగర పోలీసు కమిషనర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదాన శిబిరంల పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో కెజిహెచ్ బ్లడ్ బ్యాంక్‌తో పాటు ఎన్‌టిఆర్ ట్రస్ట్, ఎఎస్ రాజా, లైఫ్ సేవ్ బ్లడ్ బ్యాంక్ తమ సేవల్ని అందించాయి. అదే విధంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా పోలీసు రీజనల్ హాస్పిటల్ నందు మైక్యూర్ ఆసుపత్రి వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. మరియు వారి కుటుంబ సభ్యులకు స్వచ్ఛందంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంనందు 102 మంది పోలీసు సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు శుభవార్త

### వయోపరిమితి పెంపు కొనసాగింపు .. జీవో జారీ

అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు మీరిన నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శుభవార్త చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రస్తుతం అమల్లో ఉన్న గరిష్ఠ వయోపరిమితి పెంపును ఎపి గవర్నమెంట్ మరో ఏడాదిపాటు పొడిగించింది.

ఈ మేరకు ఏజ్ లిమిట్‌ను పెంచుతూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జీవో 132ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జీవోతో యూనిఫాం సర్వీసులు (పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, అటవీ, రవాణా శాఖ) ఉద్యోగాలకు మినహా మిగతా ఉద్యోగాలకు జనరల్ విభాగానికి చెందిన అభ్యర్థులు 42 ఏళ్ల వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

అంటే డీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థులకు వయోపరిమితి పెంపు వర్తిస్తుంది. ఈ వయోపరిమితి పెంపు గడువు 30/9/2029 వరకు వర్తించనుంది. కాగా, వయోపరిమితిని పెంచుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో గడువు సెప్టెంబర్ 30తో ముగిసిన సంగతి తెలిసిందే.

త్వరలో గ్రూప్స్, డీఎస్సీ, పోలీస్ పోస్టులతో సహా వివిధ శాఖలకు సంబంధించి వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ తాజా జీవో జారీ చేయడంతో నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు నింపనుంది.

ఇదిలావుండగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత ఉద్యోగాలను అందించే గ్రూప్-1, గ్రూప్- 2 సర్వీసులకు సంబంధించిన తుది సిలబస్ త్వరలోనే విడుదల చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ పిన్నమనేని ఉదయభాస్కర్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆయన గత సోమవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. ఈ సర్వీసులకు సంబంధించి ముసాయిదా సిలబస్‌ను నిపుణుల కమిటీకి పంపించామని, పరిశీలన పూర్తికావచ్చిందన్నారు.

## స్టార్ షట్లర్ పీవీ సింధు ఓటమి

ఒడెన్సె: భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు పెద్ద షాక్. ఎన్నో అంచనాలతో డెన్మార్క్ ఓపెన్‌లో బరిలో దిగిన సింధు తొలి రౌండ్‌లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో అమెరికన్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి బీవెన్ జంగ్ చేతిలో అనూహ్య ఓటమిని చవిచూసింది. 56 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో సింధు 17-21, 21-16, 18-21 తేడాతో పరాజయంపాలైంది. జంగ్ చేతిలో సింధు ఓడిపోవడం వరుసగా ఇది మూడోసారి. ఈఏడాది ఫిబ్రవరిలో ఇండియన్ ఓపెన్ ఫైనల్లోనూ సింధుపై అమెరికన్ షట్లర్‌దే పైచేయి కావడం గమనార్హం.









## శవ రాజకీయాలు మానుకోవాలి

- పవన్‌పై విమర్శనాస్త్రాలు
- సోమ భార్య ఫైర్.. కిడారి భార్య ధర్నా...

విశాఖపట్నం: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఇటీవల మావోయిస్టుల చేతిలో చనిపోయిన సివేరి సోమ భార్య మండిపడ్డారు. మావోయిస్టులకు అనుకూలంగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పవన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టు నేత మీనాదే ప్రాణమా?.. కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమలవి ప్రాణాలు కావా? అని ప్రశ్నించారు. నిజాయితీ గల నేతలు చనిపోతే విమర్శించడం తగదని సోమ భార్య హితవు పలికారు. పవన్ కల్యాణ్ శవ రాజకీయాలు మానుకోవాలని సివేరి సోమ భార్య హెచ్చరించారు. నిన్న పవన్ కల్యాణ్ ధవళేశ్వరం బేరేజ్ వద్ద బహిరంగ సభలో మాట్లాడుతూ రాజకీయ నేతల అవినీతి వల్లే మావోయిస్టులు పుట్టుకొస్తున్నారని వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కాగా కిడారి సర్వేశ్వరరావు భార్య గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట ధర్నాకు దిగారు.

## పోలవరం పేరుతో చంద్రబాబు క్యాట్‌వాక్‌లు

### బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ వ్యాఖ్య

గుంటూరు: పోలవరం నిర్మాణ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్నారని, అధికార టీడీపీ ప్రభుత్వం సహకరించకపోయినా పోలవరం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ వ్యాఖ్యానించారు. అమరావతిలో జరుగుతున్న బహిరంగ సభలో మాట్లాడుతూ.. సబ్ కాంట్రాక్టుల్లో కమీషన్లు, దళిత, గిరిజనుల భూముల పేరుతో టీడీపీ దోచుకుంటోందని ఆరోపించారు. పోలవరం పేరుతో ప్రతి సోమవారం చంద్రబాబు క్యాట్‌వాక్‌లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి వస్తోన్న నిధులన్నీ జన్మభూమి కమిటీలు మొదలు, చంద్రబాబు వరకు దోచుకుంటున్నారని విమర్శించారు. రాజధానికి రైతులిచ్చిన భూములతో చంద్రబాబు , లోకేష్‌లు వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు కుట్రలను తిప్పికొడతామని వ్యాఖ్యానించారు.

## స్వచ్ఛం.. శివం.. సుందరం..

### సంగీత రూపకానికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి

### టాప్ గ్రేడ్ మృదంగ విద్వాంసుడు వేంకట రమణ మూర్తి

విశాఖపట్నంః సంగీత రంగంలో మృదంగ వాద్యంలో సుశిక్షితులైన వంకాయల వేంకట రమణమూర్తిని జాతీయ స్థాయిలో నిల్పి ప్రథమ బహుమతి వరింపజేసింది. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం అఖిల భారత స్థాయిలో ప్రతీ ఏటా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తూవుంటుంది. అత్యుత్తమ కళాకారులకు అవార్డులు కూడా ప్రదానం చేస్తుంటుంది. సంగీత విభాగంలో 2017కు గాను ఆకాశవాణి విశాఖ కేంద్రం నిలయ మృదంగ విద్వాంసులు, టాప్ గ్రేడ్ కళాకారుడైన వంకాయల వేంకట రమణ మూర్తి రూపొందించిన స్వచ్ఛం.. శివం..

> శిశుర్వేత్తి.. పశుర్వేత్తి.. అనే నానుడి ప్రకారం సంగీతానికి చిన్నారులు, పశువులు సైతం చెవులు నిక్కరించి, మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుండగా ఊహాలోకాల్లో విహరిస్తుంటారు. సంగీతమంటే తెలియని వారు కూడా ఆలపిస్తున్న రాగానికి, సంగీత నాదానికి పాముల్లా తలలాడిస్తూ ఉండటం మనం చూస్తుంటాం. సంగీతంతో కొన్ని రకాల వ్యాధులను కూడా నయంచేయవచ్చుననేది ఆర్యోక్తి.



సుందరం.. సంగీత రూపకానికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి వరించడం ఎంతైనా ముదావహం. సీనియర్ అనౌన్సర్ రాంభట్ల నృసింహ శర్మ చరించిన ఈ రూపకానికి ద్వారం వికెజి త్యాగరాజ్ సంగీతాన్ని సమకూర్చారు. సీనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ డివి సత్యనారాయణ సాంకేతిక సహకారమందించారు. స్వచ్ఛం.. శివం.. సుందరం.. సంగీత రూపక ప్రధానోద్దేశ్యమేమిటంటే స్వచ్ఛమైన ఆలోచన, స్వచ్ఛమైన స్వరం, స్వచ్ఛమైన సమాజానికి విశ్వమానవాళి అభ్యున్నతికి అవసరమని తెలియజేయడమే. కార్యక్రమ నిర్వహణాధికారి కె.వి. రావు పర్యవేక్షణలో కేంద్ర సహాయ సంచాలకుడు కాకరపర్తి సత్య నారాయణ మూర్తి నిర్దేశకత్వంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది.

పై విషయాన్ని కార్యక్రమ నిర్వహణాధికారి బి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఇంజనీరింగ్) డి. రామకృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందులో అగ్రశ్రేణి విద్వాంసులు అందరూ పాల్గొన్నారు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com